

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st May '56
6

Photo by P. R. Shinde



బహుమతి
పొందిన వ్యాఖ్య


ఇంతమాత్రం సందుంటే...

పంపినవారు :
కె. ఎస్. ఆర్. రావు - కదిరి

చందమామ

ఈ సంచికలో కథలు - వింతలు - విశేషాలు

ఇవిగాక రంగుల బొమ్మ కథ, ఫోటో శీర్షికల పోటీ, వార్తలు, విశేషాలు, మొదలైన మరి ఎన్నో ఆకర్షణలు.























SUNLIGHT SOAP

సన్‌లైట్ సబ్బు

బట్టలు చాలకాలము మన్నునట్లు చేయును

భారతదేశంలో తయారుచేయబడినది

S. 237-50 TL

మీరు కొనాలనుకున్న ధరలో

ఒక దివ్యమైన కెమేరాను ఉంచుకొనండి


ఈ దివ్యమైన 'కోడక్' కెమేరాలలో ఒక దానిని ఉంచుకొనుటకు మీరు గర్వపడతారు. మీరు ఎంచుకొనుటకు ఎన్ని రకములవి ఉన్నాయో చూడండి:


★ వాడుటకు అత్యంత సులభమైన కెమేరా కావాలంటే, మీకు అనుకూలమైనది కోడక్ 'జూనియర్' I కెమేరా. ఇంకా పెద్ద లెన్సు మరియు మార్చుకొందుకు షట్టరు వేగములు కావాలంటే 'జూనియర్' II ఎంచుకొనండి.

★ మీకు మేలు రకపు కెమేరా యిష్టమైతే, కోడక్ 'స్టెర్లింగ్' II కెమేరాను ఉంచుకొనుటకు యిష్టపడతారు.

★ లేక సరసమైన ధరలో ఎక్కువ విలువగల కెమేరా కొనాలనుకుంటే మీరు ఎంచుకొనుటకు రెండు దివ్యమైన మీనియేచర్ కెమేరాలు, కోడక్ 'రెటినెట్' మరియు కోడక్ 'రెటినా' I b, ఉన్నాయి.

మీ కొడక్ డీలరుని యీ కెమేరాలను మరియు యింకా ఎన్నో యితర మోడలులను చూపెట్టమనండి. మీకు సరియైన కెమేరా ఎంచిపెట్టుటకు అతను సహాయపడును.





సిక్స్-20 కోడక్ 'జూనియర్' II కెమేరా

ఈ ఫోల్డింగ్ కెమేరాలో f/6.3 లెన్సు మరియు రెండు వేగములుగల షట్టర్ కలవు: 1/25 సెకెండ్ మసగ వెలుతురు లేక ఫ్లాష్ చిత్రములకు. 1/50 సెకెండ్ ప్రకాశవంతమైన బయట స్నేపులు తీయుటకు. 'కోడక్' 620 ఫిల్మ్ మీద 8 తేజోవంతమైన చిత్రములు వచ్చును. ... ... రు. 115/-

తోలు కేసు ... ... రు. 9/8

ఫ్లాష్‌హోల్డర్ ... ... రు. 29/-

కోడక్ 'స్టెర్లింగ్' II కెమేరా

ఒక మేలు రకపు కెమేరా, దీనిలో f/4.5 లెన్సు మరియు 1/200 సెకెండ్ వరకు వేగములుగల షట్టర్ కలవు. 'కోడక్' 620 ఫిల్మ్ మీద 8 తేజోవంతమైన చిత్రములు తీయవచ్చును. బూడిదరంగు ఫిట్టింగులతో, సొగసైన క్రోమియం మరియు నలుపు రంగు కెమేరా. ... ... రు. 157/8


తోలు కేసు ... ... రు. 9/8

ఫ్లాష్‌హోల్డర్ ... రు. 29/-

కోడక్ లిమిటెడ్ (ఇంగ్లండులో స్థాపితము) బొంబాయి - కలకత్తా - ఢిల్లీ - మద్రాసు

చక్కని, స్పష్టమైన చిత్రములు కావా





సిక్స్-20 కోడక్ 'జూనియర్' I కెమేరా

వాడుటకు ఒక బాక్సు కెమేరా అంతలా సులభము. మరియు తీసుకొనిపోవుటకు వీలుగా మడిచి పెట్ట వచ్చును. చక్కని ఆధునికమైన డిజైను: 'కోడక్' 620 ఫిల్ము మీద 2¼" x 3¼" సైజులో ఎనిమిది స్నేపులు వచ్చును. ... ... రు. 76/-
తోలు కేసు ... ... రు. 9/8









కోడక్ 'రెటినెట్' కెమేరా

త్వరితమైన f/3.5 లెన్సు. కాంపర్ రేపిడ్ షట్టర్ (1/500): ఎక్స్పోజర్ సులభము చేయుటకు క్రొత్త 'లైట్-వేల్యూ' సెట్టింగులు. మీ బొటనవ్రేలితో నొక్కితే షట్టర్ సరిచేసి, ఫిల్మును చుట్టి ఎక్స్పోజర్లను లెక్కపెట్టును. 'కోడక్' 135 బ్లేక్ అండ్ వైట్ లేక రంగు ఫిల్ము (35 మి.మీ) మీద 36 లేక 20 చిత్రములు. ఎవర్-రెడీ కేసుతో సహా రు. 250/-
ఫ్లాష్‌హోల్డర్ ... రు. 47/8

కోడక్ 'రెటినా' Ib కెమేరా

ఘనమైన f/2.8 కోసెడ్ లెన్సు. అన్ని రంగులను గ్రహింపగలదు. సింక్రో-కాంపర్ షట్టర్(1/500): క్రొత్త లైట్-వేల్యూ సెట్టింగులు. తక్షణమే ఫిల్ము చుట్టుకునే, షట్టర్ రీసెట్ చేసే ఏర్పాటు దీనిలో కలదు. 'కోడక్' 135 బ్లేక్ అండ్ వైట్ లేక రంగు ఫిల్ము (35 మి.మీ) మీద 36 లేక 20 చిత్రములు. ఎవర్-రెడీ కేసుతో సహా రు. 380/-
ఫ్లాష్‌హోల్డర్ ... రు. 47/8

ధరలలో అమ్మకపు పన్ను చేర్చబడలేదు

K. 2478

ఎంతే 'కోడక్' ఫిల్మునే వాడండి!

శరవేగంగా వస్తోంది!

శంకర్ ప్రొడక్షన్సు వారి తొలికానుక!



నవ్వులతో నవరసాలు కురిపించే

సదారమ

జానకి • రేలంగి • కౌశిక్ • ముక్కామల • నరసింహరాజు
ఇ.వి.సరోజ మరియు నాగేశ్వరరావు

రచన: "కీ.శే. తోలేటి, జి.కె. మూర్తి B.A.

డైరెక్షన్: కె.ఆర్.సీతారామశాస్త్రి

విజయ రిలీజ్

స్టూడియో: ఏ.వి.ఎం

G.H.Rao

* *

మే 4 తేది
విడుదల







రాజశ్రీ వారి

జయం మనదే

నిర్మాత
సుందర్‌లాల్ నహాతా....

దర్శకుడు
టి.యస్. ప్రకాశరావు



BHARAT STUDIO

రాజా సులోచన తెలుపుకు, మరియు శుద్ధతకు లక్స్ టాయిలెట్ సబ్బును కోరుకొనును

రాజా సులోచన సౌందర్య సూచనలు














సినిమా తారలకు సౌందర్యమునిచ్చు శుద్ధమైన తెల్లని సబ్బు

భారతదేశంలో తయారుచేయబడినది

LTS. 476-50 TL

చందమామ

సంచాలకుడు : 'చక్రపాణి'

జగత్ప్రసిద్ధి సంపాదించిన భారతీయ గ్రంథాలలో "పంచ తంత్రం" ఒకటి. ఇందులోని కథలు కనీసం అయిదువేల ఏళ్ళుగా భారతీయులు చెప్పుకున్నట్టు పరిశోధకులు వక్కాణిస్తున్నారు. క్రీస్తుపూర్వం 3-వ శతాబ్దంలో, విష్ణుశర్మ అనే బ్రాహ్మణుడు ఈ కథలన్నిటినీ సేకరించి "పంచ తంత్రం" అనే గ్రంథం రచించాడు.

ఈ గొప్ప గ్రంథం చాలా శతాబ్దుల క్రితమే అనేక భాషలలోకి అనువదించబడి, వివిధ దేశాలలో గొప్ప ఖ్యాతి సంపాదించుకున్నది.

ఈ గ్రంథాన్ని తేలికైన భాషలో, చక్కని ద్విపదలో, "చందమామ" పాఠకులకు అందించ నిశ్చయించాము. ఉపక్రమణిక కిందటి సంచికలోనే వెలువడింది. ఈ సంచికనుంచీ అసలు గ్రంథం ఆరంభ మవుతున్నది.

మే 1956

సంపుటి 18

సంచిక 5



అట్టిపెట్టిన బొమ్మ

గంధర్వరాజు చేతిలో ఓడి, పరాభవం భరించలేక ప్రాయోపవేశం చేసిన దుర్యోధనుడు, కర్ణాదుల కోరికవల్లనైతేనేమి, పాతాళంలో దైత్యులిచ్చిన సలహా వల్లనైతేనేమి ప్రాయోపవేశం మాని హస్తినాపురానికి తిరిగి వచ్చేశాడు.

తరవాత దుర్యోధనుడికి ఉత్సాహం చేకూర్చటానికి కర్ణుడు పెద్ద సైన్యాన్ని తీసుకుని జైత్రయాత్ర బయలుదేరాడు. అతను నాలుగు దిక్కులా జయించి, గెలిచిన రాజ్యాలన్నీ దుర్యోధనుడి పరంచేసి, సంతోషపెట్టాడు. అప్పుడు దుర్యోధనుడు వైష్ణవమనే యజ్ఞం చెయ్యటానికి తలపెట్టాడు.

ఈ యజ్ఞంకోసం నగరం వెలపల విశాల ప్రదేశాన్ని బంగారు నాగళ్ళతో దున్నించారు. తరవాత శిల్పులు వచ్చి యజ్ఞశాలలు నిర్మించారు. ఈ యజ్ఞానికి రమ్మని పాండవులను ఆహ్వానించటానికిగాను దుర్యోధను డొక దూతను ద్వైత వనానికి పంపాడు. ఆ దూతతో ధర్మరాజు, "మేము ప్రస్తుతం వనవాసదీక్షలో ఉన్నాము. యజ్ఞంకోసమై దీక్షకు భంగం కలగగూడదు. అందుచేత రాలేము," అన్నాడు. అప్పుడు భీముడు దూతతో, "మా అరణ్యవాసమూ అజ్ఞాతవాసమూ ముగియగానే మా అన్నగా రొక యజ్ఞం చేస్తారు. అందులో దుర్యోధనుడూ, అతని తమ్ములు యజ్ఞ పశువులుగా ఉంటారు. ఆ యజ్ఞానికి నేను వస్తానని దుర్యోధనుడితో చెప్పు!" అన్నాడు. దూత తిరిగి వెళ్ళిపోయాడు.

తరవాత దుర్యోధనుడు యజ్ఞాన్ని గొప్పగానే చేశాడు. అతడికి చాలా సంతోషం కలిగింది. ముఖ్యంగా కర్ణుడిచ్చిన ప్రోత్సాహం తలుచుకుని, పాండవులతో జరగబోయే యుద్ధంలో తాను గెలిచినట్టే భావించుకున్నాడు.

ఇది జరిగిన కొద్దికాలానికే, అక్కడ ద్వైత వనంలో, ఒకనాడు ధర్మరాజు నిద్రపోతూండగా, ఆయన కొక కల వచ్చింది. ఆ కలలో ఆయనకు అనేక అరణ్య మృగాలు కనిపించాయి. "మీరెందుకు వచ్చారు? నావల్ల మీకు కావలిసినదేమిటి?" అని ధర్మరాజు వాటిని అడిగాడు.

"మహాత్మా, మేము ఈ ద్వైతవనంలో వుండే మృగాలం. ఎంతోకాలంగా మీ తమ్ములు మమ్మల్ని వేటాడి, మా వంశాలు పూర్తిగా నాశనమయే స్థితి తెచ్చిపెట్టారు. మాయందు దయవుంచి మీరు మరొక అరణ్యానికి వెళ్ళి, మమ్మల్ని బతకనివ్వండి!" అని అవి జవాబు చెప్పాయి. ధర్మరాజు దీనికి అంగీకరించి, మరునాడే తన తమ్ములతో భార్యతోసహా కామ్యక వనానికి వెళ్ళిపోయాడు.



మిత్రభేదం

ఒక అరణ్యమ్ములో - ఒక్క సింహమ్ము
ఒక ఎద్దు మైత్రితో - ఉండుట జూచి;
కనుల నిప్పులు పోసు - కొని ఒక నక్క
పని గట్టుకొని వాని - పగవారి జేసె.

అది ఎట్టులన్నచో - అలింపుడింక
గుదిగ్రుచ్చి చెప్పెద - మది నిల్పుకొనుడు.
కలదొక్క పురము క-ల్మలకు నాకరము,
కలదా పురమ్మున - కలిగినవాడు—

అలవర్ధమానకు - డను వర్తకుండు,
తెలివి తేటలు గల - కులపుత్రు డతడు.
అత డొక్క రాత్రి శ - య్యాగతుండగుచు
మతి ధనార్జనసేయు - మార్గాల దలచె.

ధనముతో రానిది - ధరణిలో లేదు,
గనుక సంపాదింప - గడగు మానవుడు.
ధనమున్నవాడె వి - ద్వాంసుడై చెల్లు
ధనమున్నవాడె భూ - మిని పూరుషుండు.

ధనమున్నవాని చెంతనె నేస్తు లుంద్రు;
ధనమున్నవాని చెంతనె బంధువులును.
ధనము లేకున్నచో - మనసెంతయున్న
వనవాసిగా వాని - జనులు చూచెదరు.

కలిగిన పగవారు - కలిసి రాగలరు;
కలదిపోయిన బంధు - వులు కానివారె.
లోకులందఱు ధన - లోభమ్ము వలన
చీకటి కాడైన - చేర బోవుదురు.

పేదవారై నట్టి - పెద్దల వీడి
పోదురు దూరమై - పుత్రులు గూడ.
ముదుసలి యైనను - ముదుపున్నవాడు
పదునారు వర్షాల - బాలకు డౌను.

పదునారు వర్షాల - బాలకుడైన,
అది లేనిచో పట్టి - ముదిపీనుగౌను.
అగును గావున ధన - మార్జించు కొఱకు,
తగిన ఉపాయమ్ము - తలపోయవలయు.

విద్వాన్ విశ్వం

ఆరు దారులు గల - వార్జనమ్మునకు,
ధారుణీ పతిసేవ; - దారి యాచనలు;
వ్యవసాయ; మదిగాక-పాండిత్య మొకటి;
వ్యవహార; మాపయి - వర్తక మొకటి.


వీనిలో ఉత్తమ - మౌను వర్తకము,
ఏనాడు వ్యర్థమై - పోనిది సుమ్ము.
ఎందరో యాచకు, - లందున దాత
ముందు పాత్రాపాత్ర - ముల జూడలేడు.

వ్యవసాయమున చిక్కు-లా! పెక్కు లుండు;
అవని వర్షము లేక - అది చెడిపోవు.
వడ్డీల కిచ్చిన - వసుధ ధనమ్ము
గడ్డిపోచయు రాక - కడ వెళ్లవచ్చు.

సేవకా వృత్తిలో - చెడుగులు కలవు;
పావన మార్గమ్ము - వర్తక మొకటె.
—అని తలపోసి వై - శ్య కుమారకుండు
పనివినె మరునాడె - ధనము గడింప.

సరుకును కుండల - బిరబిర నింపి
పర దేశములకేగి - తిరిగి రాదలచి,
శుభదినమ్మును జూచి - సొంత పెద్దలను
శుభమనిపించి వై-శ్యుడు ప్రయాణించె.

తమ యింటి గిత్తలే - తన బండి నీడ్చు
కొమరైన సంజీవ - కము, నందకమ్ము.
ఎంత భారమ్మైన - నీడుపగలవు.
అంతేల? జవసత్వ - మంతము లవ్వి.



యమునానదీ తీర - మందలి యిసుక
గిమగిమ లాడించె - గిత్తల దారి.
సంజీవకమ్మను - చక్కని గిత్త
పుంజుకోలేక ఆ - బుజుగులో చిక్కి

కాడి తప్పించి అ - క్కడ కాలు వణికి
ఈడిగిలం బడె - నీడుపలేక.
బండిగిత్త అవస్థ - పరికించి వర్త
కుండు, మనస్సున - కుందుచు నిలిచె.

ఆ యెద్దు పైనున్న - అనురాగమునను
పాయక మూన్నాళ్ళు - ప్రక్కనే ఉండె.
చెంతనున్నట్టి వా - రెంతయో వగచి
చింతించుచున్న ఆ - సెట్టితో ననిరి:

క్రూరమృగాలతో - గుబులు పుట్టించు
ఘోర కాననమున - గూర్చుంట తగదు.
ఒక ఎద్దు కొఱకు ఈ - ఉన్న వారెల్ల
సుకము గోల్పోయిన-శుభ మెట్టులగును ?

కొంచెము కోసమై - గొప్పవోనాడ
మంచిది కాదన్న - మాట సత్యమ్ము.
గొప్ప కార్యాలకై - కొంచెము వదలు
టెప్పుడు నయ శాస్త్ర-హితము, సమ్మతము

బలియౌదుమా ? ఒక్క-పసరమ్ము కొఱకు
బలగమ్ముతోపాటు - పులుల గుంపులకు.
అది నిజమేనని - ఆ వర్తకుండు,
పదుగురు మనుషుల - పడి వున్న గిత్త



కావలాకై వుంచి, - కదలెను దారి.
ఆ పదిమంది భ - యంపడినారు.
మరునాడె సెట్టిని - దరియంగ నేగి,
'మరణించినది - గిత్త మనవి' అన్నారు.

ఆ వార్త విని దుఃఖ - మంది వర్తకుడు
కావలసిన యట్టి - కర్మల జేసి
పోలేక పోలేక - పురపుర పొక్కి
మూల బలమ్ముతో - ముందుకు సాగె.

ఇసుకలో అక్కడ - ఇరుకు కొన్నట్టి
పసిగిత్త యమునపై - పచ్చెడు గాలి
చల్లగా సోకి వి - శ్రాంతి చేకూర్ప
మెల్ల మెల్లన లేచి - మెడసాపి నిలిచె.

పచ్చల బోలిన - పచ్చిక మేసి
విచ్చలవిడినుండు - వృషభమ్ము బలిసె.
బొంపలమై శివు - నందికేశ్వరుని
చందమ్ముగా బల - సంపన్న మయ్యె.

బలిసె మూపురము, క-న్నుల వాడియెక్కె,
పలపలమని వన్నె - తళతళలాడె.
పుట్టల కొమ్ముల - బొడిచి కోరాడు
గట్టిఅంకెల కొండ - గట్టుల గలచు.

గిట్టలు తాటించి - గీపెట్టుకొనుచు
కట్టడయే లేక - కానలో దిరుగు
యమునానదీ తీర - మం దెల్లచోట్ల
కొమరొందు నా యెద్దు - కొమ్ములు దిరిగి.

దేవుని దయయున్న - దిక్కుమాలినది
నేవళమ్ములు దేలి - నిక్కుచు బ్రదుకు.
పూలలోపల బెట్టి - పూజించు నదియు
పాలిపోవును కాని - కాలమైనపుడు.

అడవిలో త్రోసిన - యదియు వర్ధిల్లు;
గుడిదాచినది పాడు - పడి పోవుచుండు.
అనినారు పెద్దల - య్యది సత్యవాక్కు;
మన గిత్తయే నిద - ర్శనము దానికిని.





చంద్రాపీడుడు కాంచన నగరపు రాజు. ఆయనవద్ద ధవళముఖుడని ఒక సేవకు డుండేవాడు. ధవళముఖుడు ఏ రోజు కూడా కొలువునుంచి నేరుగా ఇంటికి వచ్చే వాడు కాడు. ఎక్కడో భోజనం చేసి తాంబూలం వేసుకుని, బాగా పొద్దుపోయిం తర్వాత యిల్లు చేరుకునేవాడు.

ధవళముఖుడి భార్య ఒక రోజు తన భర్తను, "ఏమండీ, మీరు ప్రతి రోజూ ఎక్కడో భోజనం చేసి వస్తారుగదా, ఎవరు మీకు భోజనం పెడతారు? ఎందుకు పెడ తారు?" అని అడిగింది.

ధవళముఖుడు భార్యతో, "నాకు ఇద్దరు మంచి స్నేహితులున్నారు. అందులో ఒకడు కల్యాణవర్మ అనేవాడు. అతను నాకు తనవద్ద వున్నది యేది కావాలన్నా యిస్తాడు. ఇక రెండోవాడు వీరబాహు అనేవాడు. అతను నాకు ఎలాటి ప్రాణ స్నేహితుడంటే, అవసరమైతే నా ప్రాణా నికి తన ప్రాణం అడ్డువేస్తాడు!" అన్నాడు.

తన భర్తకు అంత గొప్ప స్నేహితు లున్నారని విని ధవళముఖుడి భార్య చాలా సంతోషించింది. "ఏమండీ, నాకు మీ మిత్రులను ఒకసారి చూపుతారా?" అని భర్త నడిగింది.

"దానికేం భాగ్యం? రేపు నావెంట రా! ఇద్దరి యిళ్లకూ వెళ్లివద్దాం!" అన్నాడు ధవళముఖుడు.

మర్నాడు ఉదయం భార్యా భర్త లిద్దరూ కల్యాణవర్మ ఇంటికి వెళ్లారు. అతడు వారిని గొప్పగా సత్కరించాడు. అతణ్ణి గురించి తన భర్త చెప్పినదానిలో అతిశయోక్తి లేదని ధవళముఖుడి భార్య తెలుసుకున్నది.

తరవాత ఆ దంపతులిద్దరూ వీరబాహు ఇంటికి వెళ్ళారు. వారు వెళ్లేసరికి వీరబాహు ఎవరితోనో చదరంగం ఆడుతున్నాడు.

టి. భీమారావు

అతను ధవళముఖుడికేసి ఒకసారి చూసి, "ఏమోయ్, వచ్చావా? కూచో!" అని తిరిగి ఆటలో నిమగ్నుడయాడు.

భార్యా భర్తలు కొంచెంసేపు కూచుని "వెళ్ళివస్తాం!" అన్నారు. వీరబాహు తల ఎత్తకుండానే, "మంచిది!" అన్నాడు.

ధవళముఖుడితో భార్య, "కల్యాణ వర్మకన్న ఈ వీరబాహు మీకు ప్రాణస్నేహితుడని చెప్పారుగదా, ఇతనికన్న అతనే మనని ఎంతో ఆదరంగా చూశాడే?" అన్నది.

"వారిద్దరి మధ్యా గల వ్యత్యాసం చూడాలంటే, రేపు నువు యిద్దరిదగ్గిరికీవెళ్లి, నామీద రాజుగారికి ఆగ్రహం వచ్చిందని చెప్పు," అన్నాడు ధవళముఖుడు భార్యతో.

అప్రకారమే ఆమె మర్నాడు ముందుగా కల్యాణవర్మ యింటికి వెళ్ళి అతనితో, "అయ్యా, నా భర్తపై రాజుగారు అలిగారు. మీరు మీ మిత్రుడికి యేమైనా సహాయపడగలరా?" అని అడిగింది.


కల్యాణవర్మ హడలిపోయి, "అమ్మా, నేను వర్తకం చేసుకునేవాణ్ణి. రాజుగారిని ఎదిరించి నేనేం చెయ్యగలను. నీ భర్త దేశం వదలి పారిపోవటం మంచిది," అన్నాడు.

ధవళముఖుడి భార్య అక్కడినుండి బయలుదేరి వీరబాహు యింటికి వెళ్లి అతనితోకూడా అదే మాట చెప్పింది. ఈ మాట వింటూనే వీరబాహువు డాలూ, కత్తీ పట్టుకుని ఆమె వెంట బయలుదేరి వచ్చి ధవళముఖుడితో, "మిత్రమా, నీమీద రాజుకు కోపం తెప్పించిన తుచ్ఛుడెవడో చెప్పు! వెంటనే ఆ పాపాత్ముణ్ణి హతమార్చుతాను!" అన్నాడు ఆవేశంతో

ధవళముఖుడు నవ్వుతూ "కూచోవోయ్. మంత్రిగారు మంచిమాటలతో రాజుగారిని నాపట్ల సుముఖుణ్ణి చేశారులే!" అన్నాడు.

వీరబాహు వెళ్లిపోయాక ధవళముఖుడు భార్యతో, "చూశావుగదా, నా ఇద్దరు మిత్రులలో గల వ్యత్యాసం!" అన్నాడు.





11

[తాము నివసించే అడవి ప్రాంతాలను, నరవాహనుడు తన అనుచరులకు ధారాదత్తం చేశాడని తెలియగానే, కోయపెద్దలందరూ భగ్గున మండిపడ్డారు. వాళ్లందరూ తోడేలు గూడెంలో సమావేశమై, నరవాహనుణ్ణి ఎదిరించాలనే నిశ్చయానికి వచ్చారు. కోయవృద్ధుడు ముందుగా ఒక దూతను శాంతి రాయబారిగా నరవాహనుడిదగ్గిరకు పంపాడు. తరవాత—]

తోడేలుగూడెంలో కోయపెద్దల సమావేశానంతరం జరిగిన గాథంతా శివదత్తుడు చెప్పుకుపోతున్నాడు. మందరదేవుడు అంతా శ్రద్ధగా ఆలకిస్తున్నాడు.

"నేను భయపడినంతా అయింది!" అన్నాడు శివదత్తుడు. "దూత, గాడిదమీద ఎక్కి రావటం చూసిన ఇద్దరు యువకులు మైదానంకేసి పరిగెత్తి కొద్దిసేపట్లో దూతను గూడెం చేర్చారు. అతడి వాలకం చూస్తూనే పాపం, అతడు పడిన బాధలు ఎలాంటివో నేను ఊహించ గలిగాను.

దూత తాను పడిన నరక యాతన అంతా వివరంగా చెప్పాడు. సైనికులు అతణ్ణి నరవాహనుడిదగ్గరకు తీసుకు పోయారు. నరవాహనుడు, కోయవృద్ధుడు రాసిన లేఖ చదువుకుని మండిపడి, దూతను యాభై కొరడాదెబ్బలు కొట్టించి, తల బోడి చేయించి, ముఖమంతా మసిపూసి, గాడిద మీద రాజవీధులు వూరేగింపించాడు. తరవాత 'మీ కులపెద్దకు యిది నా జవాబు!' అంటూ అతడి వీపుకు ఒక మేకచర్మం కట్టించాడు. దానిమీద ఒక కోయవాణ్ణి,





రెవరూ లేరన్నగర్వంతో వున్న నరవాహనుడికి యీ కోయల తిరుగుబాటు ఒక గుణపాఠాన్ని నేర్పగలదు!

"శివదత్తా, మీ నరవాహనరాజు ప్రదర్శించిన పొగరుబోతుతనం గమనించారు గదా?" అంటూ నాకేసి సాభిప్రాయంగా చూశాడు వృద్ధుడు.

"అయితే మీరు యుద్ధానికి సిద్ధమేనన్న మాట?" అని అడిగాను.

కోయవృద్ధుడు ఒకక్షణకాలం తలవంచుకుని, తరవాత సాలోచనగా నాకేసి చూస్తూ, "అంతకన్న మరే మార్గమూ నాకు కనబడటంలేదు. లోగడ మీరు చెప్పినట్టు సుశిక్షితులైన అతడి సైనికులను, ముఖాముఖి ఎదిరించటం ప్రమాదకరం. కనుక పొంచివుండి హఠాత్తుగా మీద పడి శత్రువులను చీకాకుపరిచే యుద్ధతంత్రాన్ని అనుసరించటం క్షేమంగదా?" అన్నాడు.


"కాని ఆ పద్ధతి విజయాన్ని సమకూర్చలేదు. ఏదో ఒకనాడు, మీరు కుండలినీ నగరాన్నీ, రాజప్రాసాదాన్నీ ముట్టడించవలసివుంటుంది!" అని చెప్పాను.

అవునన్నట్టు వృద్ధుడు తల వూపాడు. అంతలో నలుగురైదుగురు కోయ యువకులు కేకలువేస్తూ, మేము వున్న చోటుకు

నరవాహన సైనికుడు గొలుసులతో బంధించి తీసుకుపోతున్నట్టు చిత్రింపించాడు.

ఆ చిత్రంలోని భావాన్ని అర్థంచేసుకున్న వృద్ధుడు నాకేసి తిరిగి, "అయితే, మాకు బానిసబ్రతుకో, మరణమో తప్పదన్న మాట. ఈ రెంటిలో తప్పనిసరైతే నేను మరణాన్నే కోరుకుంటాను!" అన్నాడు. ఆ నిమిషాన అతడి నేత్రాలనుంచి నిప్పులు కురిసినై.

పరిస్థితులు నాకు అనుకూలంగా కాకపోయినా, నరవాహనుడికి వ్యతిరేకంగా పరిణమిస్తున్నట్టు నేను గ్రహించాను. సమరసేనుడి మరణానంతరం, యిక తనను కుండలినీ ద్వీపంలో ఎదిరించేవా






పరిగెత్తుకుంటూ వచ్చారు. వృద్ధుణ్ణి చూస్తూనే నమస్కరించి, "అయ్యా, శత్రువులు పెద్ద బలగంతో మనమీదకు దాడి వస్తున్నట్టుంది. పదాతి అశ్వికదళాలే కాక, కొందరు ఏనుగులమీదకూడా ఎక్కి వస్తున్నారు. వాళ్లు వేలసంఖ్యలో వున్నారు. మనం ఏంచేయాలి?" అని అడిగారు.

"మనం అంతపెద్ద సైన్యాన్ని ఎదిరించబోవటంలేదు," అన్నాడు వృద్ధుడు నిబ్బరంగా, "ఆ వచ్చే శత్రువులను యీ అడవిలో తమకు తోచినచోటికి వెళ్ళనివ్వండి. కాని, వీలు దొరికినప్పుడల్లా హఠాత్తుగా దాడిచేసి చీకాకుపరచండి!"

"మనం మచ్చికచేసిన పులులనూ, సింహాలనూ వుపయోగించవచ్చా?" అని ఒక కోయ యువకుడు ప్రశ్నించాడు.

"ఓ, నిస్సందేహంగా!" అన్నాడు వృద్ధుడు. "విష బాణాలనూ, విష సర్పాలనూ...ఎలా అయినాసరే, శత్రువు హడలెత్తేట్టు చేయండి!"

ఈ ఆజ్ఞలు విని కోయయువకులు వెళ్లిపోయారు. శత్రువులమీద మచ్చికచేసిన పులులనూ, సింహాలనూ యెలా వుపయోగిస్తారో నా కర్థంకాలేదు. విషపు బాణాల సంగతి నాకుతెలుసు. అడవులలో నివసించే



అనేక ఆదిమజాతులు శత్రుసంహారానికి విషపూరితమైన బాణాలను ప్రయోగిస్తారు. అవి ఒకసారి శత్రువును తాకితే, వాటి మొనలకు పూసివున్న విషకారణంగా— ఆ శత్రువు నానా యాతనా పడి తప్పక మరణించ వలసిందే.

"శివదత్తా, మిమ్మల్ని నేనొక రహస్య ప్రదేశానికి తీసుకుపోతాను. మీ అనుచరులు కూడా నిరభ్యంతరంగా మీవెంట రావచ్చును," అన్నాడు కోయవృద్ధుడు.

ఆ రహస్యప్రదేశం యెక్కడో, యీ పట్టున అక్కడికి వెళ్లవలసిన అవసరమేమిటో నా కర్థంకాలేదు. నా సంశయాన్ని



గమనించిన వృద్ధుడు నవ్వుతూ, "శివదత్తా, శత్రువులనుంచి కాపాడుకునేందుకు మాకూ మీవలెనే కోటలూ, కందకాలూ, యితర రక్షా సాధనాలూ వుంటవి. నే చెపుతున్న రహస్యప్రదేశం, మా కోయలలో కొద్దిమందికి తప్ప, అందరికీ తెలియదు. అది కొన్ని వందల సంవత్సరాలకిందట శిథిలమైపోయిన ఒక కొండమీది దుర్గం. నరవాహనుడికి వ్యతిరేకంగా మేము జరపబోయే యుద్ధం, అక్కడినించే నడపబడుతుంది," అన్నాడు.

వృద్ధుడు అంత చెప్పింతరవాత, ఆపైన అతణ్ణి నేను ప్రశ్నించదలచలేదు. నేను నా అనుచరులతో బయలుదేరాను. కోయ వృద్ధుడివెంట కొంతమంది యువకులు వున్నారు. అందరం కలిసి దట్టంగా వున్న అడవిప్రాంతంకేసి బయలుదేరాం. మేము వెళ్ళే మార్గంలో అనేక కోయగూడేలు వున్నవి. ప్రతి గూడెంలోనూ యుద్ధసన్నాహాలు జరుగుతున్న సూచనగా చాలా కోలాహలం కనబడింది.

ఒక గూడెంలో కొందరు కోయ యువకులు నాలుగైదు చిరుత పులులకు మెడలకు తాళ్ళుకట్టి చిన్న చిన్న గుడిశెలనుంచి బయటికి లాక్కువస్తున్నారు. ఎంతో కాలంగా మచ్చిక చేయబడిన ఆ పులులు, పెంపుడు కుక్కలలాగా వాళ్లవెంటపడి వస్తున్నవి.



"శివదత్తా, వీటినే మా కోయభటులు, నరవాహనుడి సైనికులమీద ప్రయోగించ నున్నది. విచ్చలవిడిగా వదలబడిన ఒక్కో పులి, వందమంది వీరులపెట్టు అని మీరు త్వరలోనే గ్రహిస్తారు. ఇక, నరవాహనుడి ఏనుగుల మందలను చెల్లాచెదరు చేయుటా నికి అవసరమైన సింహాలూ, కాలిబంట్లను హతమార్చేందుకు ఆయుధాలూ మాదగ్గర తయారుగా వున్నవి," అన్నాడు వృద్ధుడు.

ఆ సమయంలో, ఆ కోయల ధైర్యసాహ సాలను నేను మెచ్చుకున్నాను. విజయంలో ఆ వృద్ధుడికి వున్న నమ్మకం నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. సుశిక్షితమైన సైన్యాన్ని, పెంపుడు మృగాల ద్వారా, అక్కడా యిక్క[illegible] ప్రయోగించిన విషపు బాణాల వల్లా జయించటం సాధ్యమయ్యే పని కాదని ఆ వృద్ధుడికి తెలియదు.

అతడు దీర్ఘాలోచనతో తల వంచుకుని ముందుకు నడుస్తున్నాడు. చిన్న చిన్న గుట్టలూ, పుట్టలూ దాటుకుంటూ కీకా రణ్యంగా వున్న ప్రాంతాన్నించి మేము ముందుకు కదులుతున్నాం. ఒకచోట పది మంది కోయలు చిన్న చిన్న బుట్టలలో వున్న వేటినో ఒకపెద్ద గంపకు చేరవే స్తున్నారు. ఆ చేరవేయటంలో వాళ్ళు కన బరుస్తున్న జాగ్రత నన్ను ఆశ్చర్యపరిచింది.





"అ పెద్ద గంపలో వాళ్ళు వేస్తున్న వేమిటి ?" అని వృద్ధుణ్ణి అడిగాను.

"సర్పాలు!" అన్నాడు వృద్ధుడు. "...విష సర్పాలు! వీటి వుపయోగం యేమిటో మీరు త్వరలోనే చూస్తారు !" అంటూ నవ్వాడు.

అసరికి మేమంతా ఒకానొక కొండ ప్రాంతానికి చేరాం. ఎదురుగా యెత్తయిన కొండ వున్న సూచనగా, చాలా యెత్తున చెట్టూ చేమలూ కనిపించాయి.

"మనకు యెదురుగా వున్నది చాలా యెత్తయిన కొండ అనీ, దానిమీద ఒక శిథిలమైన దుర్గం వున్నదనీ యీ ద్వీపంలో చాలా మందికి తెలీదు. చిన్నప్పటినుంచీ ఈ ప్రాంతాల తిరిగిన మాబోటివాళ్లకు మాత్రం దాని ఉనికి తెలుసు !" అన్నాడు వృద్ధుడు.

నేను తలవూపి వూరుకున్నాను. ఒకవేళ యీ నట్టడవిలో బలమైన దుర్గం అంటూ వొకటి వుంటే, నరవాహనుణ్ణి అక్కడినించి ఎదిరించటం చాలా తేలిక అని నాకు తోచింది. ధైర్యసాహసోపేతులైన రెండు మూడు వేలమంది కోయ యువకుల సాయంతో, నరవాహనుణ్ణి అక్కణ్ణించి నానా తిప్పలూ పెట్టవచ్చు.

"కోట బాగా శిథిలమైపోయివున్నదా ?" అని వృద్ధుణ్ణి అడిగాను.



"బాగా శిథిలమైపోయిందని చెప్పలేం కాని, మొత్తంమీద శిథిలమైన దశలోనే వుంది. ఐనా, ఒకసారి మనం దాన్ని ఆక్రమించుకు కూచుంటే, అక్కడికి శత్రువులు పాదచారులై తప్ప, గుర్రాలమీదగాని, ఏనుగులమీదగాని రాలేరు. ఒకవేళ శత్రువులు గుంపులుగావస్తే, పైనుంచి రాళ్ళు దొర్లించి వాళ్లను హతమార్చవచ్చు. ఒకరొకరుగా వచ్చేట్టయితే, అక్కడి చెట్లమీద దాగివుండి, విషపు బాణాలతో వారిని తుదముట్టించవచ్చు," అన్నాడు వృద్ధుడు.

వృద్ధుడి మాటలు నన్ను చాలా సంతోషపరిచినై. తుదకు విజయం బలవంతుడైన



నరవాహనుడిదే [illegible] లోపల అతడు సైనికస[illegible]వలసి వుంటుంది. అ[illegible]ంలో పట్టణ ప్రాంతాల గల ప్రజ[illegible]తడి క్రూరపాల నకు ఎదురుతిరిగితే అతడి పతనం తప్పదు!

మేము క్రమంగా కొండ ఎక్కసాగాం. ఆ ప్రాంతం అంతగా జనసంచారం ఎరగ దన్న సూచనగా—ఎక్కడా నడిచేందుకు మార్గమే కనబడలేదు. మా ముందున్న కోయ యువకులు, పొదలనూ, తీగలనూ నరికి మాకు మార్గం చేయసాగారు.

బాగా మిట్టమధ్యాహ్నం అయేసరికి మేము కొండ ఎక్కి శిథిలదుర్గం చేరాం. అది చాలా ఎత్తయిన కొండ అని అక్కడకు చేరినతరవాతగాని నాకు బాగా అర్థంకాలేదు. అక్కడవున్న ఒకానొక శిథిలమైన గోడమీద నిలబడిచూస్తే మొత్తం కుండలినీద్వీపం, దాన్ని అన్నివైపులా ఆవరించివున్న మహా సముద్రం కనిపించాయి.

దుర్గం ఎలాంటి స్థితిలో వుంది? శత్రువులనుంచి రక్షణకు దీన్ని ఎంతవరకు వుపయోగించుకోవచ్చు? అసలు వాళ్ళు యింత దూరం రాగలరా? ఇలాంటి ఆలోచనలతో నేను ఆ దుర్గాన్ని పరీక్షించసాగాను.

దుర్గం ఒకప్పుడు చాలా బలపత్తరమైనదే అనేందుకు అక్కడ శిథిలస్థితిలో వున్న పెద్దపెద్ద స్తంభాలూ, గోడలూ సాక్ష్యంగా కనబడుతున్నవి. దుర్గంలో ప్రవేశించేందుకు వున్న పెద్దద్వారం తలుపులలో ఒకటి విరిగిపోయి పక్కకు ఒరిగివున్నది. రెండవది తుప్పుపట్టి పడిపోయేందుకు సిద్ధంగావుంది.

"శివదత్తా, మీకు దుర్గంలోపలకు పోయి చూడాలని వుంటే, మా యువకుల్లో ఒకణ్ణి మీవెంట పంపగలను," అన్నాడు కోయ వృద్ధుడు. అంతలో మా చెవులకు భీకరమైన కేకలూ, ఏనుగుల ఘీంకారాలూ వినిపించినై. "అదేమిటి?" అంటూ వృద్ధుడు అటుకేసి చూశాడు. (ఇంకా వుంది)





బ్రహ్మదత్తుడు కాశీరాజ్యాన్ని పరిపాలించే కాలంలో బోధిసత్త్వుడు ఒక పల్లెటూరి బ్రాహ్మణకుటుంబంలో జన్మించాడు. అతని పేరు సోమదత్తుడు. అతని తండ్రి అతి బీద వాడు, తనకున్న కుంట పొలమూ సేద్యం చేసుకుని ఎలాగో జీవించేవాడు.

సోమదత్తుడు పెరిగి పెద్దవాడై, తన తండ్రి కుటుంబ పోషణకోసం పడే శ్రమ కళ్ళారాచూసి ఎంతో విచారించాడు. తన తల్లిదండ్రులను సుఖపెట్టటానికి అతనికి ఒకటే మార్గం కనిపించింది. అదేమంటే, తాను ఎక్కడనైనా విద్యనేర్చుకుని కొలువులో ప్రవేశించటం. తానుకూడా తండ్రితో పాటు కష్టపడవచ్చు, కాని ఉన్న పొలం కొద్దిగనక ఫలితం ఉండదు. అందుకని సోమదత్తుడు తండ్రితో, "నేను తక్షశిలా నగరం వెళ్లి ఏదైనా విద్య నేర్చుకుంటాను," అన్నాడు. తండ్రి సమ్మతించాడు.

సోమదత్తుడు తక్షశిలవెళ్ళి, ఒక గురువు వద్ద శుశ్రూషచేసి విద్య నేర్చుకుని తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. తన తండ్రి ఎప్పటి లాగే తనకుగల రెండు ఎద్దులతో ఆ కుంట పొలమే సాగుచేస్తూ, ఉదయం లగాయతు అస్తమయందాకా శరీరశ్రమ చేస్తున్నాడు. ఇది చూసి సోమదత్తుడు, ఇక ఒక్క క్షణం కూడా ఉపేక్షించరాదనుకుని, మర్నాడే బయలుదేరి కాశీనగరం వెళ్లి అక్కడ రాజు దగ్గిర కొలువులో ప్రవేశించాడు.

ఇది జరిగిన కొద్దిరోజులకే సోమదత్తుడి తండ్రివద్ద ఉన్న రెండు ఎద్దులలో ఒకటి కాస్తా మరణించింది. ఎన్నో ఏళ్ళుగా తనను పోషిస్తూ, తనచేత పోషించబడుతూ ఉండిన ఎద్దు పోయేసరికి సోమదత్తుడి తండ్రికి ఒక చెయ్యి పడిపోయినట్టయింది. తన కొడుకు ప్రయోజకుడై రాజుగారివద్ద కొలువుచేస్తున్నాడుగదా, రాజుతో చెప్పి

ఒక్క ఎద్దును ... ా అనే ఉద్దేశంతో, సోమ... ాశీనగ రానికి వెళ్లి తనకొడు... ుకున్నాడు.

జరిగినదంతా ... సోమదత్తుడు తండ్రితో "అమ్మా, నువ్వూ పెద్దవాళ్లయి పోయారు. ఆ కాస్త భూమికోసం ఎందుకు తాపత్రయపడతారు? మీరుకూడా వచ్చేసి నావెంట ఉండండి. ఏదోవిధంగా జరిగి పోతుంది," అన్నాడు.

దానికి తండ్రి సుతరామూ ఒప్పుకోక, "నేను ఆ గడ్డమీదనే పోవాలి. అది వదిలి పెట్టి రానేరాను. ఇంకొక ఎద్దును ఇప్పించా వంటే మడి దున్నుకుంటూ హాయిగా కాల క్షేపం చేస్తాను. నాకు అక్కడ ఉండే శాంతి ఇక్కడికివస్తే ఉండదు," అన్నాడు.

సోమదత్తుడు కొలువులో చేరి కొద్ది రోజులే అయి ఉండటంచేత అతనివద్ద ఎద్దును కొనటానికి తగిన డబ్బులేదు. రాజును యాచించటం భావ్యంగాఉండదు. నిన్నగాక మొన్ననే వచ్చి అప్పుడే చెయ్యి చాస్తున్నాడని రాజుగారు అనుకోగలరు. అందుచేత అతను తండ్రితో, "నేను రాజును ఎద్దుకోసం యాచిస్తే 'నీకు ఎద్దుతో ఏంపని? ఎవరికోసం అడుగుతున్నావు?' అని ప్రశ్నలు వేస్తారు. అదీకాక కొలువు చేసేవారు యాచించటం ధర్మంకాదు. నీకీ





బాధలేవీ లేవు. ఉన్న సంగతి అంతా చెప్పి, ఒక ఎద్దును దయచేయించమని అడుగు. రాజు తప్పక ఇస్తాడు," అన్నాడు.

దీనికి తండ్రి ఒప్పలేదు. "నాయనా, నేను పల్లెటూరివాణ్ణి. ముసలివాణ్ణి. నాకు నాగలి పట్టటం తప్ప మరేమీ తెలీదు. ఎక్కడ రాజుగారు, ఎక్కడ దర్బారు, ఎక్కడ నేను! నాకా సభలోకి అడుగు పెడితే నోటమాటకూడా రాదేమో. రాజుగారితో ఎట్లా మాట్లాడాలో, ఆ మర్యాద లేమిటో నాకేమైనా తెలుస్తాయా? వద్దు, వద్దు! ఎట్లాగో నువే నాకు పనిసానుకూలం చేసిపెట్టు," అన్నాడాయన కొడుకుతో.

"అద ... రాకుండా నేను ఒక ప ... ం రాసి ఇస్తాను. దాన్ని రెండు ... రోజులు వల్లెవేసి రాజుగారి దగ్గిర ... ళ్ళి చదువు. నీ పని సానుకూలమవుతుంది," అని సోమదత్తుడు తండ్రికి ధైర్యం చెప్పాడు. తరవాత అతను ఈ శ్లోకం రాసి తండ్రిచేత వల్లెవేయించాడు.

"ద్వే మేం గోణా, మహారాజ,
యేహి ఖేత్తం కసామసే;
తేసు ఏకో మతోదేవ,
దుతియం దేహి ఖత్తియ."

దీని భావమేమంటే: "మహారాజా, నాకు రెండు ఎడ్లుండేవి. వాటితో సేద్యం



చేసుకునేవాణ్ణి. [illegible] టి చచ్చి పోయింది. ఓ [illegible] ద్దును యిప్పించండి," [illegible]

ముసలివాడు చ[illegible] శ్రమపడి యీ శ్లోకాన్ని కంఠస్థం చేసుకున్నాడు. తరవాత సోమదత్తుడు తన తండ్రిని తనతోబాటు దర్బారుకు తీసుకువెళ్లాడు. కొడుకు చెప్పిన విధంగా ఆయన రాజుకూ, మంత్రులకూ నమస్కారాలు చేసి, చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు.

"ఎవరు మీరు? ఏం కావాలి?" అని రాజు అడిగాడు. వెంటనే ముసలివాడు లోగడ వల్లెవేసిన శ్లోకం చదివాడు. కాని కంగారులో శ్లోకం కొద్దిగా మారిపోయి ఈవిధంగా తయారయింది:

"ద్వే మేం గోణా, మహారాజ,
యేహి ఖేత్తం కసామసే;
తేసు ఏకో మతో దేవ,
దుతియం గణ్హ ఖత్తియ."


సభికులంతా నవ్వారు. సోమదత్తుడు తల వంచుకున్నాడు. ఎందుచేతనంటే అతని తండ్రి కంగారులో, "నాకు రెండవ యెద్దును యిప్పించండి," అనటానికి, "నా రెండో యెద్దును తీసుకోండి!" అనేశాడు.


రాజు వృద్ధుడితో, "నీ ఎద్దును నాకివ్వటానికేనా ఇంటినుంచి బయలుదేరి ఇంత దూరం వచ్చావు?" అన్నాడు నవ్వుతూ.

"మహారాజా, కావలిస్తే మీరు దాన్ని తీసుకోండి. దానిమూలానే యింత గొడవ వచ్చింది," అంటూ జరిగినదంతా రాజుకు సోమదత్తుడి తండ్రి విన్నవించుకున్నాడు.

సోమదత్తుడి నీతివర్తనకు రాజు చాలా సంతోషించాడు. తన కొలువులో ఉన్న వాళ్ళంతా రాజును చీటికీ మాటికీ ఆశ్రయించేవారే. సోమదత్తుడు అలా చేయలేదు. రాజు 8 జతల యెడ్లను చక్కగా అలంకరింపజేసి, సోమదత్తుడి తండ్రికి దానం ఇచ్చేశాడు.







మారుమనువుపెళ్లి

కన్యాకుబ్జ నగరపు రాజు తాళధ్వజుడనే వాడికి పుష్పకేతుడు, చిత్రభానుడు, పింగళుడు అని కుమారులుండేవారు. ఈ ముగ్గురు దక్షిణదేశం చూడాలని బయలుదేరి కొంతకాలానికి స్త్రీ రాజ్యం చేరారు. ఈ రాజ్యానికి పుష్పపురం రాజధాని, అక్కడ రత్నమకుట అనే రాణి రాజ్యంచేస్తున్నది.

ముగ్గురు రాజకుమారులూ ఒక మేడ అద్దెకు తీసుకుని నగరపు వింతలు చూడటానికి తలా ఒక దారినా వెళ్ళారు. అందరికన్న చిన్నవాడు పింగళుడు ఒక వీధి వెంట పోతూ ఒక రాజభవనం ఎదట ఒక అందమైన ఆడదాని చిత్తరువు వేళ్లాడగట్టబడి వుండటం చూశాడు. దాని పక్కన ఒక ప్రకటన వుంది. అందులో యిలా వుంది : "ఈ చిత్తరువు మహారాజరత్నము అనే గొప్ప యింటి కన్యది. విద్వాంసులైన యువకులెవరైనా ఆమె పంపే సంకేతాలకు సమాధానా లివ్వగలిగితే ఆమెను పెళ్ళాడవచ్చు. ఓడినవారు పరిచారక వృత్తి అవలంబించవలసి వుంటుంది. ఇందుకు సమ్మతించినవారు గంట వాయించండి."

మహారాజరత్నం చిత్తరువు చూడగానే పింగళుడికి ఆమెను పెళ్లాడాలనిపించింది. అతను గంట వాయించాడు. వెంటనే యిద్దరు దాసీలు వచ్చి అతన్ని సగౌరవంగా లోపలికి తీసుకుపోయి ఒక గదిలో కూచోపెట్టి వెళ్ళిపోయారు. తరవాత వారు పళ్ళెంలో ఆకుచిగుర్లు తెచ్చి అతనికి చూపి, "వీటికి సమాధానాలివ్వండి," అన్నారు. ఎంతసేపు ఆలోచించినా పింగళుడికి ఆ సంకేతాల అంతర్యం తెలియలేదు.

పింగళుడు ఓడినట్టు ఒప్పుకోక తప్పిందికాదు. వెంటనే కొందరు భటులు వచ్చి అతనిచేత ముతకగుడ్డలు కట్టించి, పనిచెయ్యడానికి తోటలోకితీసుకుపోయారు.

కె. గోపాలరావు



ఆ రోజు సాయంకాలమయేసరికి పుష్ప కేతుడు బసకు తిరిగివచ్చి తన తమ్ము లిద్దరూ రాకపోవటం గమనించాడు. అతను మర్నాడు ఉదయం లేచి, వాళ్లను వెతు క్కుంటూ కొత్త వీధుల వెంట బయలు దేరాడు. కొద్దిసేపట్లో అతనుకూడా మహా రాజరత్నం బొమ్మ కట్టివున్న ఇంటికి వచ్చి ప్రకటన చూశాడు. అక్కడి భటులను విచారిస్తే, "మీ పోలికగా వుండేవాడొకడు నిన్న వచ్చి సంకేతాలు చెప్పలేకపోయాడు. తోటలో పనిచేస్తున్నాడు!" అని చెప్పారు. ఓడిపోయినవాడు పింగళుడే అయివుంటా డని అతనికి నమ్మకం కుదిరింది. తాను యెట్లాగైనా ఈ మహారాజరత్నాన్ని ఓడించి తమ్ముణ్ణి విడిపించుకోవాలి!

కాని పుష్పకేతుడు తొందరపడి గంట వాయించలేదు. పుష్పపురంలో గల గొప్ప పండితుడి పేరు తెలుసుకుని ఆయనవద్దకు వెళ్ళాడు. "స్వామీ, తమవద్ద అపూర్వ గ్రంథాలుంటాయని తెలిసింది. ఒకసారి చూడనిస్తారా?" అని వినయంగా అడిగాడు. పండితుడు ఆదరంతో తనదగ్గిర వున్న గ్రంథాలన్నీ చూపించాడు. వాటిలో పుష్ప కేతుడికి తెలియని గ్రంథం ఒక్కటే వున్నది. అది పద్మశ్రీ అనే బౌద్ధసన్యాసి రచించిన నాగరసర్వస్వం అనే గ్రంథం. అందులోని సంజ్ఞాప్రకరణం నాలుగైదు సార్లు చదువుకుని పుష్పకేతుడు పండితుడికి ఆ గ్రంథం యిచ్చివేసి, అతడివద్ద సెలవు పుచ్చుకుని, తిరిగి మహారాజరత్నం యింటికి వెళ్ళి గంటవాయించాడు.

దాసీలు వచ్చి అతన్ని లోపలికి తీసుకు పోయి మర్యాదగా ఒక గదిలో కూచోపెట్టి, వెళ్లి ఒక పళ్లెంలో లేత అకుచిగుళ్ళు తెచ్చారు. వాటిని చూడగానే "కులప్రశ్నాం కుర స్మృతః" అని చదివినది జ్ఞాపకం వచ్చింది. మహారాజరత్నం అతని కులం అడుగుతున్నది. తాను క్షత్రియుణ్ణని అతను



సమాధానం పంపాడు. ఇలాగే ఇంకా మరి కొన్ని సంకేతాలు వచ్చాయి. అన్నిటికీ పుష్పకేతుడు సరిఅయిన సమాధానా లిచ్చాడు. దాసీలు ఆఖరుసారి వచ్చి, "మా యజమానురాలు మిమ్మల్ని చూడ గోరుతున్నారు!" అని చెప్పారు.

పుష్పకేతుడు వారివెంట చాలా నడవలు దాటి ఒక అద్భుతమైన గదిలో ప్రవేశించాడు. ఒక బంగారు సింహాసనంమీద కూర్చునివున్న ఒక స్త్రీ అతన్ని చూచి లేచి నమస్కరించి, "దయచెయ్యండి! యింత కాలానికి నా ప్రశ్నలన్నిటికీ మీరొక్కరే సమాధానం యిచ్చారు. నేను మిమ్మల్ని వివాహం చేసుకోవటానికి సిద్ధంగా వున్నాను," అన్నది నవ్వుతూ.

పుష్పకేతు డామెను చూసి నిర్ఘాంత పోయాడు. ఏమంటే ఈమె మహారాజరత్నం కాదు. మహారాజరత్నంకన్న కూడా అందంగా వుండటమేగాక, రాజ లాంఛనాలూ, కిరీటాలూ ధరించికూడా వున్నది.

"ప్రశ్నలు పంపింది నీవా? నీవు మహారాజరత్నానివి కావే!" అన్నాడు అతను.

"నేను మహారాజరత్నాన్ని కానుగాని, ప్రశ్నలు పంపింది నేనే. నేనీదేశపు రాణీని. నా పేరు రత్నమకుట. మహారాజరత్నం



నా స్నేహితురాలు. నేనే భర్తని వెతుక్కుంటున్నానని ప్రజలకు తెలియకుండా వుండగలందులకు నా స్నేహితురాలి ఎరుకతో నేనీ పని చేశాను," అన్నదామె.

"ఇందువల్ల నాకు నష్టమేమీ లేదుగాని నా తమ్ముడొకడు నిన్న నీతో ఓడిపోయి తోటలో నౌకరుగా పని చేస్తున్నాడు. దయవుంచి అతన్ని వెంటనే విడుదలచెయ్యి," అన్నాడు పుష్పకేతుడు.

రత్నమకుట నవ్వి, "అతను మీ తమ్ముడా. మా మహారాజరత్నం అతన్ని నిన్ననే చూసి వరించింది. మనతోబాటే వారికీ వివాహం అవుతుంది!" అన్నది.



ఇక్కడ యిలా వుండగా: ఆ కిందటిరోజు నగరం చూడబోయిన చిత్రభానుడికి ఒక విచిత్రమైన అనుభవం జరిగింది.

ఆ నగరంలో మణిమంతుడనే కోటీశ్వరుడైన వైశ్యుడున్నాడు. ఆయనకు లేక లేక ఒక ఆడపిల్ల పుట్టింది. దానికి ఊర్మిళ అని పేరుపెట్టి, ఆ పిల్లకోసం అనేకమంది దాదులను పెట్టి ఎంతో గారాబంగా పెంచారు. తండ్రి కోటీశ్వరుడు, పిల్ల చక్కని రంభ. అందుచేత ఆమెకు తగిన సంబంధం వెతకటానికి మణిమంతుడు ఎన్నో లక్షలు ఖర్చు చేశాడు. ఆఖరుకు, శుకద్వీపంలో వుండే రత్నపాదుడనే వర్తకుడి కుమారుడితో సంబంధం ఆయనకు నచ్చింది. సంబంధం నిశ్చయమయింది. పెళ్ళివారు భారీ ప్రయత్నాలు చేసుకుని, బలగంతో సముద్రంమీద తరలిరావాలిగనక, ఆరుమాసాల వ్యవధిలో ఒక పెళ్ళిముహూర్తం పెట్టి మణిమంతుడు లగ్నపత్రిక పంపాడు. ఆ ముహూర్తాన పెళ్ళి జరగకపోతే మరి మూడేళ్ళ దాకా మంచి ముహూర్తం లేదనికూడా ఆయన పెళ్ళివారికి కబురుచేశాడు.

పెళ్లి ప్రయత్నాలు చాలా ఆర్భాటంగా జరిగాయి. పదివేలమందికి సరిపడే విడుదులు ఏర్పాటుచేశారు. అనేకవందల ఎకరాలమేర పందిళ్లు వేశారు. అనేకరకాల వాద్యాలూ, వినోదాలూ ఏర్పాటుచేశారు.

పెళ్లి రోజు వచ్చింది. పెళ్లికి పిలిచిన జనం వేలాదివేలు వచ్చి పందిట్లో కూచున్నారు. కాని పెళ్లివారి జాడ లేదు. ఇంకా లగ్నం రెండు గడియలుందనగా మణిమంతుడి భటులు సముద్రతీరంనుంచి గుర్రాలమీద వచ్చి, పెళ్లివారి పడవలు సముద్రంలో రాళ్లగుట్టలు తగిలి మునిగి పోయినట్టు తెలిసిందని చెప్పారు.

మణిమంతుడికి కాలూ చెయ్యీ ఆడ లేదు. ఇన్ని ప్రయత్నాలుచేసి, యిన్ని వేల మందిని పిలిచి పెళ్లి ఎలా ఆపటం? ఆయన

పెళ్ళి చూడవచ్చినవారి మధ్యకు వెళ్ళి, చుట్టూ కలయచూశాడు. ఆయన కన్ను చిత్రభానుడిపై పడింది. ఆయన అతన్ని అవతలికి పిలుచుకుపోయి జరిగినదంతా చెప్పి, "నాయనా నా పిల్ల మెడలో పుస్తె కట్టి, నా పరువు కాపాడు. నాకు పదికోట్ల ధనం వుంది. ఒకతే పిల్ల! అందంలో నీకు తీసిపోదు!" అని ప్రాధేయపడ్డాడు. చిత్ర భానుడు తాను ఫలానా రాజు కొడుకునని చెప్పి, ఊర్మిళను చేసుకోవటానికి అంగీక రించాడు. పెళ్లి జరిగిపోయింది.



పెళ్లి జరిగిన ఏడవరోజున పెళ్లివారు పది వేల మందితో తరలివచ్చారు. మణిమంతుడి గుండె గుభేలుమన్నది. ఆయన రత్నపాదుడి వద్దకు వెళ్లి జరిగినదంతా చెప్పుకున్నాడు.

"ఇదంతా నీ కల్పనే! సముద్రంలో కొండలు తగిలి పడవలు చిల్లులుపడ్డ మాట నిజమే. ప్రాణాలు కాపాడుకోవటానికి విల వైన సరుకులు సముద్రంలో వేసి, కీలు పూసి రంధ్రాలు బిగించి ఎలాగో చేరాం. ఇంత ప్రయాసపడి వస్తే మాకింత అవ మానం చేస్తావా? యెవరనుకున్నావు?" అని రత్నపాదుడు కేకలువేశాడు.

"ముహూర్తం దాటి మీరు వచ్చిమాత్రం ఏం లాభం?" అన్నాడు మణిమంతుడు.

"పెళ్లికి ముహూర్తమంటూ ఒకటి వుందా ఏమిటి? ఎప్పుడు పెళ్లి అయితే అప్పుడే ముహూర్తం!" అన్నాడు రత్నపాదుడు.

ఈ మాట వినేసరికి మణిమంతుడికి ఓర్పు పోయింది. ఇద్దరూ గట్టిగా పోట్లాడు కున్నారు. "చూడు నిన్నేం చేస్తానో!" అని రత్నపాదుడు బెదిరించాడు. ఆ మనిషితో మాట్లాడటం వృథా అనుకుని మణిమం తుడు యింటికి తిరిగివచ్చాడు. కాని ఆయన మనసు పీచు పీచుమంటూనే వుంది. రత్నపాదుడి వెంట పదివేలమంది ఉన్నారు. వాళ్లు తన యింటిమీద పడి ఏం అఘాయిత్యం చేస్తారో అని భయపడ్డాడు.

తన మామ... వుందని తెలిసి చిత్రభాను... ండగా నీకేమీ భయంలేదు... కు!" అన్నాడు.

మణిమంతుడు భయపడ్డట్టే రత్నపాదుడి మనుషులు పదివేలమందీ కర్రలు తీసుకుని మణిమంతుడి ఇంటిమీద పడ్డారు. వేసిన పందిళ్ళు యింకా విప్పలేదు. పెళ్ళికి వచ్చిన బంధువులింకా వెళ్ళిపోలేదు. మణిమంతుడు హడలిపోయాడు. కాని చిత్రభానుడు కత్తిదూసి పదివేలమందికీ ఎదురు వెళ్ళి సాహసించి ముందుకు వచ్చినవాడినల్లా నరికాడు. కొందరు చచ్చి, కొందరు గాయపడేసరికి మిగిలినవారు పారిపోయారు.

అప్పటికైనా బుద్ధి తెచ్చుకుని వచ్చిన దారి పోక రత్నపాదుడు ఆస్థానానికి వెళ్ళి మణిమంతుడిపై ఫిర్యాదుచేశాడు. రత్నపాదుడూ, మణిమంతుడూ చెప్పినదంతా విని రాణీ తీర్పు చెప్పలేక, "ఈ నేరం మీరే విచారించండి!" అని భర్తను కోరింది.

పుష్పకేతుడు మణిమంతుడి అల్లుడి సాక్ష్యంకూడా వినాలన్నాడు. అతనికోసం భటులు వెళ్ళి తిరిగివచ్చి, "మహాప్రభూ, ఆయన రానన్నాడు!" అని చెప్పారు.

పుష్పకేతుడీ జవాబు విని మండిపోయి, పింగళుణ్ణీ, మరి కొందరు సైనికులనూ వెంటబెట్టుకుని మణిమంతుడి యింటికి బయలుదేరాడు. తనను తీసుకుపోవటానికి సైన్యం వస్తున్నదని గ్రహించి చిత్రభానుడు కత్తిదూసి వీధిలో నిలబడ్డాడు. కాని తీరా వాళ్ళు సమీపించాక అన్నదమ్ములు ఒకరినొకరు గుర్తించుకుని ఆశ్చర్యపడ్డారు.

చిత్రభానుడుకూడా తన సోదరుల కథ విని చాలా సంతోషించాడు. తరవాత పుష్పకేతుడు రత్నపాదుడి నేరం విచారణ పూర్తిచేసి, అతనిదే తప్పయినప్పటికీ అనేకవిధాల నష్టపడి వుండటంచేత శిక్షించక, అతనికి కలిగిన నష్టంకింద మణిమంతుడిచేత కొంత పరిహారం యిప్పించి పంపేశాడు.



భూగోళం - గాలిపారలో ... లు


భూమిని అన్నివైపులా ఆవరించి ఉండే గాలిపార అకాశం ... ల మైళ్ళవరకూ చొచ్చుకుపోతున్నట్టు ఇదివరలో తెలుసుకుని ఉన్నాం. ఈ గ ... శాస్త్రజ్ఞులు మూడు అంతస్తులుగా విభజిస్తున్నారు. ఇందులో అట్టడుగున, భూమిని చుట్టిఉండేదాన్ని "ట్రోపో స్ఫియర్" అంటారు. ఈ పొరయొక్క మందం అంతటా ఒకవిధంగా లేదు. ఇది ఉత్తర దక్షిణ ధృవప్రాంతాలలో 4 మైళ్ళ ఎత్తుండి, భూమధ్యరేఖకేసి వచ్చినకొద్దీ ఇంకా ఎత్తుకుపోతూ, భూమధ్యరేఖప్రాంతంలో 11 మైళ్ళ ఎత్తుదాకా వ్యాపించిఉన్నది. ఈ పొరలోనే వాయు సంచలనం, తుఫానులూ, గాడ్పులూ ఉంటాయి. వేడెక్కిన గాలి పైకి పోయేటప్పుడు సాధా రణంగా ఈ అంతస్తుదాటి పైకి వెళ్ళదు. గాలియొక్క ఒత్తిడిలాగే వేడికూడా పైకి వెళ్ళేసకొద్దీ తగ్గిపోతుంది. ఈ అడుగు అంతస్తులో మూడువందల అడుగులు పైకి వెళ్ళినప్పుడల్లా గాలివేడి ఒక డిగ్రీ తగ్గుతుంది. గాలిలో ఉండే దుమ్మూ, తడీ, సూక్ష్మక్రిములూ, పొగా, బొగ్గుపులుసుగాలీ ఈ అంతస్తులోనేఉంటాయి. వీటిమూలంగానే వాతావరణంలో రకరకాల మార్పు లేర్పడుతూంటాయి; రకరకాల మబ్బులు పుడుతూంటాయి.

గాలిపారతాలూకు రెండవ (మధ్య) అంతస్తును "స్ట్రాటోస్ఫియర్" అంటారు. ఇది కింది అంతస్తుపైన 40 లేక 50 మైళ్ళవరకు విస్తరించి ఉంటుంది. ఈ అంతస్తులో ఉండే గాలి చాలా చల్లగా ఉంటుంది. కింది అంతస్తులోలాగా, ఈ అంతస్తులో పైకి పోయినకొద్దీ గాలి చల్లబడుతుందని రూఢిగా చెప్పటానికి లేదు.

ఈ అంతస్తులోకి ఏ విమానమూ పోలేదు. కాని పికార్డ్ మొదలైన శాస్త్రజ్ఞులు పరి శోధనల నిమిత్తమై బెలూన్ల సహాయంతో ఈ అంతస్తులోకి వెళ్ళారు. వారుచేసిన పరిశోధనలను బట్టి ఒక్కొక్కసారి, పైకి వెళ్ళినకొద్దీ గాలి వేడెక్కటంకూడా కనిపించింది!

భూమిచుట్టూ ఉండే మొత్తం గాలిలో సుమారు నాలుగోవంతు ఈ రెండో అంతస్తులో ఉన్నట్టు శాస్త్రజ్ఞులు ఊహిస్తున్నారు. పొగా, దుమ్మూ, నీటి ఆవిరీ ఈ అంతస్తులోకి పోలేవు. కాని కొన్ని సూక్ష్మక్రిములూ, అగ్నిపర్వతాల తాలూకు ధూళీ, ఏకకణ ప్రాణులూ ఈ అంత స్తులో కనిపిస్తాయి. బొగ్గుపులుసు గాలికూడా ఇక్కడ కొంచెంగా కనిపిస్తుంది. చాలా కొద్ది పాటి నీటి ఆవిరి ఇక్కడ చేరి, ఘనీభవించి సూక్ష్మమైన పలుకులుగా ఏర్పడి, ఉల్లిపొర మేఘం లాగా తయారవుతుంది. ఇక్కడ వాయుసంచలనం తూర్పునుంచి పడమరకు సమతలంలో సాగుతుంది. భూమధ్యరేఖనుంచి ధృవాలవైపుకుకూడా గాలిచలనం స్వల్పంగా ఉంటుంది.

గాలిపొరలో పై అంతస్తును "అయానోస్ఫియర్" అంటారు. ఇందులోకి మనిషి ఇంకా అడుగుపెట్టలేదు. దీనినిగురించి శాస్త్రజ్ఞులు తెలుసుకున్నవన్నీ ఊహించిన విష యాలే. ఈ అంతస్తులో ప్రాణవాయువు, నత్రజని, హైడ్రొజెన్, హీలియం మొదలైన వాయువులుండవచ్చు. ఉల్కలూ, విద్యుజ్జనితమైన కాంతిప్రసారాలూ ఈ అంతస్తులో కలుగుతాయి.



మూడు సందేహాలు

ఒకానొక రాజుకు ఒక ఆలోచన వచ్చింది. ఏ పని ఎప్పుడారంభించాలి? ఎవరి సలహా తీసుకోవాలి? అనుసరించదగిన ఉత్తమ ధర్మ మేమిటి? కాలమూ, పాత్రమూ, ధర్మమూ తెలిస్తే తనకు ఎన్నడూ అపజయ మన్నది ఉండదని పించింది. అందుచేత ఆయన, ఈ మూడు సందేహాలూ తీర్చిన వారికి గొప్ప బహుమతులిస్తానని రాజ్య మంతటా దండోరా వేయించాడు.

దండోరా విని చాలామంది జ్ఞానులు రాజువద్దకు వచ్చారు. కాని రాజు వేసిన ప్రశ్నలకు వారిచ్చిన సమాధానాలు ఒక దానికొకటి సంబంధించకుండా ఉన్నాయి.

ఏ పనిగాని ఎప్పుడు మొదలుపెట్టాలి అన్న ప్రశ్నకు కొందరు పంచాంగం చూస్తే తెలుస్తుందనీ, మరికొందరు ఆరంభించే పనినిబట్టి యోగాలు మారుతాయనీ, ఇంకా కొందరు అవసరాన్నిబట్టి పనులు ముందు వెనకలుగా చేసుకోవాలనీ, యెవరికి తోచి నట్టు వారు చెప్పారు.

ఎవరి సలహాలు తీసుకోవాలన్న ప్రశ్నకు కొందరు మంత్రుల సలహా తీసుకోవా లన్నారు, మరి కొందరు బ్రాహ్మణోత్తముల సలహా తీసుకోమన్నారు, ఇంకా కొందరు సామంతుల సలహా తీసుకోమన్నారు.

ఉత్తమధర్మ మేది అన్న ప్రశ్నకు కొందరు శాస్త్రజ్ఞానం సంపాదించట మన్నారు, మరి కొందరు వ్రతాలూ, ధర్మాలూ చెయ్యటమన్నారు, ఇంకా కొందరు యుద్ధం చెయ్యటమన్నారు.

ఇందరూ యిన్నివిధాలుగా చెబుతూంటే రాజుకు ఒక్కరి సమాధానమూ నచ్చ లేదు. ఆయన తాను యివ్వదలచిన బహు మతి ఎవరికీ యివ్వలేదు. రాజధాని సమీ పంలో వుండే వనంలో ఒక మహర్షి వుంటున్నాడు. తను ఆయనదగ్గరకు వెళ్లి,

టాల్‌స్టాయ్ ఆధారం


తన సందేహాలు తెలిపి, సమాధానాలు తెలుసుకుందా మనుకున్నాడు రాజు.

అయితే ఆ మహర్షి తన ఆశ్రమం దాటి రాడు, ఆశ్రమంలోకి సామాన్యులను తప్ప రానివ్వడు. అందుచేత రాజు సామాన్యుడి దుస్తులు ధరించి కొద్ది పరివారాన్ని వెంట బెట్టుకుని గుర్రంమీద ఆశ్రమంకేసి వెళ్లాడు. ఆశ్రమం వెలపలనే ఆయన గుర్రం దిగి, తన పరివారాన్ని అక్కడే వుండమని, తానొక్కడూ మహర్షి పర్ణశాలవేపు వెళ్లాడు.

మహర్షి పర్ణశాల ముందుగల తోటలో మొక్కలకు మడులు తవ్వుతున్నాడు. ఆయన రాజు చేసిన నమస్కారం స్వీకరించి మళ్లీ తవ్వటంలో నిమగ్నుడయాడు.

రాజు ఆయనతో, "స్వామీ, నేను తమరి నడిగి మూడు సందేహాలకు సమాధానాలు తెలుసుకోగోరి వచ్చాను. ఏ పనిగాని ఎప్పుడారంభించాలి? ఎవరెవరి సలహాలు స్వీకరించాలి? ఆచరించదగిన ఉత్తమ ధర్మం ఏది?" అని అడిగాడు.

తవ్వటం ఆపి రాజు మాటలు విన్న మహర్షి సమాధానం చెప్పకుండానే మళ్లీ తన పని ప్రారంభించాడు. మహర్షి వృద్ధుడు, తపశ్చర్యమూలానా, ఉపవాసాలమూలానా బక్కచిక్కి వున్నాడు. రాజు ఆయనతో,



"తాము విశ్రాంతి తీసుకోండి. నేను తవ్వి పెడతాను," అన్నాడు. గునపాన్ని రాజు కిచ్చి మహర్షి నేలమీద చతికిలబడ్డాడు.

రాజు నాలుగు పాదులు తవ్వి మహర్షిని మళ్ళీ వెనకటిలాగే తన సందేహాలడిగాడు. కాని మహర్షి సమాధానమివ్వటానికి బదులుగా లేచి రాజు చేతిలో వున్న గునపం తీసుకోబోయినాడు. అయితే రాజు గునపం యివ్వలేదు. సూర్యాస్తమయిందాకా రాజే పాదులు తవ్వాడు. పని పూర్తి అయింది. రాజు గునపాన్ని కింద పెట్టి, "స్వామీ, మీరు చాలా జ్ఞానులనీ, నా సందేహాలు తీరుస్తారనీ వచ్చాను. వాటికి సమాధానాలు

మీకు తెలియని [illegible] , నేను నా దారిన పోతా[illegible]

"ఎవరో వ[illegible] . విశేష మేమిటో తెలుసు[illegible]!" అన్నాడు మహర్షి. రాజు వెనక్కు తిరిగి చూసేసరికి వనంనుంచి ఆశ్రమంలోకి వస్తూ ఒక వ్యక్తి కనిపించాడు. అతను చేతితో తన పొట్ట నొక్కిపట్టుకుని వున్నాడు. అతని వేళ్ళ సందునుంచి రక్తం బయటికి వస్తున్నది. అతను రాజుదాకా వచ్చి మూలుగుతూ స్పృహతప్పి పడిపోయాడు. రాజూ, మహర్షీ కలిసి ఆ మనిషి దుస్తులు విప్పి చూసేసరికి అతని పొట్టలో పెద్ద గాయం వుంది. రాజు ఆ గాయాన్ని చాలాసేపు కడిగినాక రక్తం కట్టింది. తరవాత ఆ మనిషికి స్పృహ వచ్చి తాగటానికేమైనా యివ్వమని అడిగాడు. రాజు కుటీరంలోనుంచి మంచినీళ్లు తెచ్చి అతనిచేత తాగించాడు.

ఇంతలో చీకటిపడింది. రాజూ, మహర్షీ కలిసి గాయపడినవాణ్ణి కుటీరంలోకి చేర్చారు. ఆ మనిషి పక్కమీద పడుకుని కళ్లు మూసుకున్నాడు. రాజు మడి తవ్వి అలిసివుండటంచేత అక్కడే మండిగానికి తల చేర్చి తెల్లవార్లూ గాఢనిద్రపోయి, తెల్లవారి లేచాడు. ఆయనకు మొదట తానెక్కడ వున్నదీ తెలియలేదు. చూస్తే మంచం



మీద పడుకుని వున్న వ్యక్తి తనకేసి తదేక దృష్టితో చూస్తూ కనిపించాడు.

రాజు నిద్రలేచినట్టు గ్రహించి ఆమనిషి, మంచం దిగివచ్చి, "మహారాజా, నన్ను క్షమించండి!" అన్నాడు.

"నువ్వెవరో నేనెరగను. నిన్నెందుకు క్షమించటం?" అని అడిగాడు రాజు.

"మీరు నన్నెరగరుగాని, నేను మిమ్మల్ని ఎరుగుదును. మీరు ఒకప్పుడు నా అన్నను ఉరితీయించి, అతని ఆస్తి స్వాధీనపరచుకున్నారు. మిమ్మల్ని చంపి పగతీర్చుకుంటానని అప్పుడు నేను శపథంచేసి మీమీద కక్షకట్టాను. మీ శత్రువును. మీరు మహర్షిని చూడవె[illegible] ఆశ్రమంనుంచి తిరిగి [illegible]పుదామని ఒక పొదలో దాగి[illegible]రెంతకూ రాలేదు. అందుచేత నే[illegible]టునుండి బయటికి వచ్చి మీకోసం బయలుదేరాను. ఇంతలో మీ అంగరక్షకులు నన్నుచూసి, గుర్తించి, గాయపరిచారు. నేనెలాగో వారి బారినుంచి తప్పించుకున్నాను. కాని మీరు నా గాయాన్ని కడిగి రక్తం కట్టించకపోతే రక్తస్రావంతో చనిపోయి ఉండేవాణ్ణి. నేను మిమ్మల్ని చంపాలనుకుంటే, మీరు నా ప్రాణం రక్షించారు. మీరు నన్ను బతకనిచ్చే పక్షాన నేనూ, నాకొడుకులూ మీకు



యావజ్జీవం భృ[illegible]గలం!" అన్నాడా మనిషి[illegible]

ఇంత సులువు[illegible]వుతో రాజీ కుదిరినందుకు రాజు[illegible]షించాడు. ఆ మనిషికి రాజవైద్యుడిచేత చికిత్స చేయిస్తాననీ, అతని అన్నతాలూకు ఆస్తి అతని పరం చేస్తాననీ రాజు మాట ఇచ్చాడు.

రాజు కుటీరంలోనుంచి బయటికి వచ్చేసరికి మహర్షి పాదులు పెడుతూ కనిపించాడు. రాజాయనను సమీపించి నమస్కరించి, "స్వామీ, నా సందేహాలు తీర్చారు కారు," అన్నాడు.

మహర్షి నవ్వి, "నీ సందేహాలన్నీ తీరేపోయాయి. అర్థం కాలేదా? నిన్న నువు నా బలహీనత చూసి జాలిపడి మడి తవ్వుతూ ఉండిపోయావుగాని, వెళ్ళిపోతే నిన్నామనిషి చంపేవాడే. కనుక, ఆ సందర్భంలో ప్రధానమైన వేళ నువు మడి తవ్వినది, నీకు ప్రధానమైన వ్యక్తిని నేను. నాకు సహాయపడటమే నీ ప్రధాన ధర్మమయింది. తరువాత ఆమనిషి పరిగెత్తుకుంటూ వచ్చినప్పుడు నీకు ప్రధానమైన వేళ నువ్వతనికి సేవచేసినది. ప్రధానమైన వ్యక్తి అతను. అతనికి సహాయపడటం నీ ప్రధానధర్మమయింది. జ్ఞాపకం ఉంచుకో; ప్రధాన కాలం—ఇప్పుడే! ఎందుకంటే ఆక్షణంలోనే మనకు శక్తి అధీనంలో ఉండేది. ఆ క్షణంతర్వాత ఏమి జరగనున్నదో మనకు తెలీదు. ఇకపోతే, నీకు ప్రధానమైనవ్యక్తి నీవెంబడి ఉన్నవాడు! ఎందుకంటే మనకు మరొకడితో ప్రమేయం ఉండబోయేదీ, లేనిదీ అప్పట్లో ఎవరూ చెప్పలేరు. ఇక ప్రధాన ధర్మం ఏమంటే వాడికి సాయపడటం! ఎందుకంటే దానికోసమే మానవజన్మ ఎత్తాం!" అన్నాడు.

రాజు ఈ సమాధానాలకు పరమానందంచెందాడు. ఆయన మహర్షికి నమస్కరించి తన భవనానికి వెళ్ళిపోయాడు.





తల్లీ కూతుళ్లు

5

ఆ రాత్రి ఆ ఇల్లుగల వర్తకుడు పొద్దుపోయి తన నౌకరుతోసహా ఇంటికి తిరిగి వచ్చి తలవాకిలి తలుపులు దగ్గిరిగా వేసి ఉండటంచూసి ఆశ్చర్యపోయాడు. ఇల్లంతా చూసినమీదట దొంగతనంమటుకు జరగ లేదని తేలిపోయింది.

వర్తకుడి స్నానానికి నీటికోసం, సేవకుడు బావివద్దకు పోయి బావిలో చేద వేసి నీరు తోడబోయాడు. కాని చేద విపరీతమైన బరువనిపించింది. "బాబయ్యో, దయ్యం!" అంటూ సేవకుడు గాభరాగా పరుగెత్తాడు. వర్తకుడు దీపంతీసుకుని దొడ్లోకి వెళ్ళేసరికి చేదతాడు పట్టుకుని బావిలోనుంచి ఎక్కి వస్తూ పాదరసం కనిపించాడు.

"బమ్మాష్! ఎవరు నువు? నా బావిలో నీకేం పని? చెప్పు! ఇప్పుడే నిన్ను భటులకు వప్పగిస్తాను!" అంటూ వర్తకుడు అరిచాడు.

"అయ్యా, ఇది ఏ దేశం? ఏ గ్రామం? నేను ఈజిప్టు దేశస్థుణ్ణి. మా నైల్‌నదిలో స్నానంచేస్తూండగా ఒక సుడిగుండం నన్ను దిగలాగింది. నేను ఎంత లోతుకు పోయానో నాకే తెలీదు. మళ్ళీ నీటిపైకి తేలేసరికి మీ బావిలో ఉన్నాను!" అని పాదరసం అలీ అమాయికంగా బొంకాడు.

వర్తకుడీ బొంకు నమ్మాడు.

"నాయనా! నీ అనుభవం చాలా చిత్రంగా వుంది. ఇది బగ్దాద్ నగరం. చాలాదూరం వచ్చావు. నీకు పొడిబట్ట లిస్తాను కట్టుకో. ఈ రాత్రికిక్కడే భోంచేసి పడుకో. రేపు ప్రయాణమై మీ నగరానికి వెళుదువుగాని!" అన్నాడాయన.

మర్నాడు ఉదయం పాదరసం ఇల్లు చేరేసరికి అహ్మద్ ప్రాణాలు లేచివచ్చాయి. తన ప్రియ శిష్యుడి జాడ తెలియక అహ్మద్

ఎస్. వెంకటసుబ్బయ్య

కిందటి రాత్రి [illegible] ు, నిద్ర పోలేదు. తెల్లవా[illegible] కొత్వాలయిన హసనీను[illegible]ంచి సలహా అడిగాడు. వాళ్లు మా[illegible]తుండగానే పాదరసం తిరిగి వచ్చాడు.

అతను తన అనుభవమంతా యిద్దరు కొత్వాలులకూ వివరంగా చెప్పాడు. హసన్ అంతా విని చిరునవ్వు నవ్వుతూ, "ఇంత పని చేయగల చిన్నది బగ్దాద్‌లో ఒకతే వున్నది. అది పావురాల టపా నిర్వహించే దిలైలా కూతురు జీనాబ్. ఇంతకూ దాన్ని ఏంచేద్దామని నీ ఉద్దేశం?" అని పాదరసం అలీని అడిగాడు.


"పెళ్ళాడదామని!" అన్నాడు పాదరసం

"ఇంత చేసినాకూడానా?" అన్నాడు హసన్ ఆశ్చర్యంగా.

"ఇంకా యింత చేసినా ఆ పిల్లను నేను క్షమించగలను. అది నాకు భార్య అయితే నాకు జీవితంలో యింకే కోరికా లేదు," అన్నాడు పాదరసం మనస్ఫూర్తిగా.

"అంత గాఢమైన కోరిక తీరకుండా ఉండరాదు. నువుకూడా మంచి అందగాడివి. మీకు జోడు సరిపోతుంది," అన్నాడు హసన్.

"మనవాడికి కాస్త సహాయం చెయ్యి, హసన్!" అని అహ్మద్ అడిగాడు.



హసన్ అప్పుడే పాదరసం అలీకి ఒక పథకం తెలిపాడు.


పాదరసం తన శరీరమంతా నల్ల రంగు పూసుకుని, నీగ్రోలాగా అంగవస్త్రం చుట్టుకున్నాడు. కొంత డబ్బూ, కొంత భంగూ తీసుకుని కూరల అంగడికి వెళ్లాడు. అక్కడ అతను దిలైలా వంటవాణ్ణి వెతికి పట్టుకుని, "అన్నా, నేనీ నగరానికి కొత్త వాణ్ణి, సాటి నీగ్రోవు కనిపించావు. సారా దుకాణానికి వస్తావా? సఖ్యంగా తాగుదాం!" అన్నాడు నవ్వుతూ.

దిలైలా వంటవాడు, "నాకు క్షణం తీరిక లేదు. మా యింటికి రారాదా? అక్కడ నీకు క[illegible]కాల తాగుడూ, భోజన[illegible]ం," అన్నాడు.

పాదరస[illegible]డా అదే. అతను ఆ నీగ్రోవాడి[illegible] దిలైలా ఇంటికి వెళ్ళాడు. వంట ఇంట్లో చేరాడు. ఇంతలోనే దిలైలా, జీనాబ్ భోజనానికి వచ్చారు. వంటవాడు వారి భోజనమూ, తాగుడూ సిద్ధంచేసి ఒక్కొక్కటే తీసుకుపోయి వారిముందు పెట్టసాగాడు. వాడు అవతలికి వెళ్లినప్పుడు పాదరసం లోటాలలో భంగు కలిపాడు.

కొద్దిసేపట్లోనే పాదరసం ప్రయత్నం ఫలించింది. దిలైలా, జీనాబ్, నలభైమంది నీగ్రో బానిసలూ, నీగ్రో వంటవాడూ, అఖ








దిలైలాకు ఒళ్ళు తెలిసేసరికి చీకటి పడుతున్నది. ఆమె పాదరసం పెట్టి పోయిన చీటీ చూసుకున్నది. ఇల్లంతా కలయజూస్తే, అతను ఖలీపాకు సంబంధించిన సొత్తుమాత్రమే సంగ్రహించాడని తెలుసుకున్నది.

దిలైలా దీర్ఘంగా ఆలోచించింది. ఈ సంగతి పైకి పొక్కితే తన పరువుకూ, ఉద్యోగానికీకూడా భంగం. పాదరసం మీద పగ సాధించుకున్నా ప్రయోజనం లేదు. అతనిచేత అహ్మదే ఈపని చేయించి ఉంటాడు. అతని కాళ్లు పట్టుకుని పోయిన సొత్తు తెచ్చుకోవటం తప్ప గత్యంతరం లేదు. అహ్మద్‌మీద పగ తీర్చుకోవటానికి గాను తాను తన కూతురిద్వారా పాదరసం అలీకి పరాభవం చేయిస్తే, దానికి ప్రతిక్రియగా అహ్మద్ ఆ పాదరసం ద్వారానే పగ తీర్చుకున్నాడు. రెంటికీ సరిపోయింది. ఇక అహ్మద్ తనతో రాజీ పడవచ్చు. "ఇప్పుడే వస్తా," అని కూతురితో చెప్పి దిలైలా అహ్మద్ ఇంటికి వెళ్లింది.

ఆమె అక్కడికి చేరేసరికి అహ్మద్, హసన్, పాదరసం అలీ మొదలైనవాళ్లు కూచుని భోజనాలు చేస్తున్నారు. ఆమెను చూడగానే అహ్మద్, హసన్ లేచి, తలలు

రుకు వేటకుక్కలు సయితం భంగు ప్రభావంతో ఒళ్ళు తెలియకుండా వున్నచోటే పడిపోవటం తటస్థించింది.

పాదరసం యథేచ్ఛగా ఇల్లంతా తిరిగి, దిలైలా అధికారరీత్యా ధరించే దుస్తులూ, బంగారు టోపీ, నీగ్రోల ఎర్రజరీ దుస్తులూ పోగుచేసి మూటగట్టుకున్నాడు; మిద్దెమీదికి వెళ్లి గూళ్ళలో ఉన్న పావురాలన్నిటినీ పెద్ద పంజరంలో పెట్టుకున్నాడు. "ఈ పని చేసినవాడు వీరాధివీరుడు పాదరసం అలీ తప్ప మరొకడు కాడు!" అని చీటీమీద రాసిపెట్టి, పావురాలూ, దుస్తులూ పట్టుకుని నేరుగా అహ్మద్ ఇంటికి వెళ్లిపోయాడు.



వంచి సలాములు చేస్తూ, "దయచెయ్యండి దిలైలా! మా పంక్తిన కూచోండి!" అని గౌరవంగా ఆహ్వానించారు.

వారు తింటున్నది పావురాయి మాంస మని తెలియగానే దిలైలాకు కళ్లు చీకట్లు కమ్మాయి, తల తిరిగిపోయినట్టయింది. ఆమె వొణికిపోతున్న గొంతుతో, "అహ్మద్‌కు నామీద ఎంత పగఉంటేమాత్రం, ఖలీఫా ప్రాణప్రదంగా చూసుకునే టపా పావు రాలను దొంగతనంగా తెప్పించి, వండిం చుకు తింటాడా? దొంగతనానికి మాత్రం నీతి లేదా?" అని అడిగింది.

"టపా పావురాలని తెలిస్తే వండుకు తినకపోదుమే," అన్నాడు పాదరసం. అందరూ నవ్వారు.

హసన్ దిలైలాను అనునయిస్తూ, "నువ్వేమీ కంగారు పడకమ్మా! టపా పావురా లెక్కడికీ పోలేదు. ఖలీఫా సొత్తంతా సురక్షితంగానే ఉంది. ఒక్క చిన్న కోరిక ఈ చిన్నవాడు కోరుతున్నాడు. దానికి నువు సరే నన్నట్టయితే నీ పావురాలూ, దుస్తులూ ఈ క్షణంలో నీపరమవుతాయి!" అన్నాడు.

"ఆ కోరిక ఏమిటో చెప్పండి. నే నసహాయురాలినని మీకుమాత్రం తెలీదూ?" అన్నది దిలైలా.



"మరేమీ లేదు. ఈ కుర్రవాడు, అలీ మీ అమ్మాయి జీనాబ్‌ను చేసుకో గోరు తున్నాడు," అన్నాడు హసన్.

"అయ్యో, నాయనా! దీనికా నన్నింత బాధించారు? నేను ఒప్పుకుని ఏంలాభం? మా జీనాబ్ ఒప్పుకున్నా లాభంలేదు. ఎందు కంటే దానికి వయసువచ్చేదాకా రక్షకుడు దాని మేనమామ, మా పెద్దన్న జురేక్. ఆయన సరేనంటేగాని ఈపెళ్లి కాదు. మీకు తెలియనిదేముందీ? జురేక్ కట్టెనా కంపనా కాలని కర్కోటకుడు. ఆయన్ని ఒప్పించే భారంమటుకు పూర్తిగా పాదరసం అలీది!" అన్నది దిలైలా.

జురేక్‌ను కలు[illegible]నుమతి సంపాదించి, అ[illegible]బ్ ను వెళ్ళాడటానికి పాది[illegible]పడ్డాడు.

దిలైలా తన దుస్తులు, నావురాలూ తీసుకుని వెళ్ళిపోయింది.

దిలైలా అన్న జురేక్‌కూడా ఒకప్పుడు గొప్పదొంగే. ఆ కాలంలో అతను చేసిన దొంగతనాలకు అచేకీ, దర్యాప్తూ విచారణా అంటూ లేదు. అతను కూచున్న చోటునుంచి కదలకుండా ఎక్కడ ఎప్పుడు ఏ దొంగతనం చెయ్యాలన్నా చేసేసేవాడు. ఇప్పుడు ముసలితనంవచ్చి, దొంగతనాలు మానేసి, చేపలు వేయించి అమ్ముకుని బతుకుతున్నాడు. కాని ఆ మనిషిలో ఇప్పటికీ ఎన్నో శక్తులున్నాయి.

జురేక్ తన దుకాణానికి జనాన్ని ఆకర్షించటానికి ఒక యుక్తి పన్నాడు. అతను తన దుకాణం వాకిలికి ఒక వెయ్యి దీనారాల సంచీ వేళ్ళాడగట్టి, దాన్ని ఎవరు ఎత్తుకుపోగలిగితే వాళ్ళు ఉంచుకోవచ్చునని చాటింపు వేశాడు. ఎట్లాగైనా దాన్ని కాజేద్దామని వేలసంఖ్యలో జనం దుకాణానికి వచ్చి సరుకు కొన్నారు. కాని ఆ సంచిని కాజెయ్యటం ఒక్కరివల్లకూడా కాలేదు. ఏమంటే ఆ సంచిని ఎవరైనా తాకితే చాలు దుకాణం నిండా గంటలూ, డప్పులూ



మోగుతాయి. అది వినగానే, జురేక్ దొడ్లో ఉన్నాసరే పరిగెత్తుకుంటూ వచ్చి దొంగను పట్టేస్తాడు, లేదా సీసంగుండ్లు దొంగలమీద విసురుతాడు. వాటి దెబ్బలకు కాళ్ళూ, చేతులూ విరుచుకున్నవాళ్లుకూడా వున్నారు.

పాదరసం అలీ, జురేక్‌ను చూశాడు. తాను ఫలానా అనీ, కొత్వాల్ అహ్మద్‌గారింట బస చేస్తూన్నాననీ, తాను జీనాబ్‌ను పెళ్ళాడ గోరుతున్నాననీ, పెళ్ళికి అనుమతించవలసిందనీ కోరాడు. కాని ముసలి జురేక్ జీనాబ్‌తో పాదరసం పెళ్లికి యెంత మాత్రం ఒప్పలేదు. అలీ, జీనాబ్‌కు తగినవాడు కాదని అతడనుకున్నాడు.

పాద[illegible]రేక్ దీనారాల సంచీ [illegible]నిద్వారా జురేక్ అనుమతి స[illegible]నాబ్‌ను పెళ్ళాడాలనీ అనిపించి[illegible]ందుకుగాను అతను గర్భిణీ స్త్రీలాగా వేషం వేసుకుని జురేక్ వుండే దుకాణానికి వెళ్ళాడు. చేపలు బేరంచేస్తూ నొప్పులు వచ్చినట్టు నటించాడు. జురేక్ కంగారుపడి తన భార్యను పిలవటానికి లోపలికి వెళ్ళాడు. ఆ సమయంలో పాదరసం చప్పున దీనారాల సంచిమీద చెయ్యివేశాడు. వెంటనే దుకాణం నాలుగు మూలలనుంచీ డప్పుల మోతా, గంటల మోతా వినిపించింది. జురేక్ దుకాణం



లోకి వచ్చి, సం[illegible]పోతున్న పాదరసం మీదికి [illegible]ంగా విసిరివేశాడు. అ[illegible] పాదరసం సొమ్మసిల్లి వీధిలో ప[illegible]డు. తరవాత కుంటుతూ అహ్మద్ ఇల్లుచేరాడు.

ఇదంతా చూస్తున్నవాళ్ళు జురేక్‌ను నానాతిట్లూ తిట్టారు. "నీ పాపిష్టి డబ్బుతో అందరికీ ఆశ చూపింది చాలక, నిండు చూలాల్ని గుండుపెట్టి కొడతావా? నువు మనిషివా, పశువ్వా?" అన్నారు వాళ్ళు.

"ఈ వేదాంతాలకేంలే?" అన్నాడు జురేక్ నిర్లక్ష్యంగా.

దెబ్బనుంచి కాస్త కోలుకోగానే పాదరసం జురేక్ దుకాణానికి మళ్ళీ బయలుదేరాడు. అతను జురేక్ చేతిలో చావటానికైనా సిద్ధపడ్డాడుగాని, జీనాబ్‌ను పెళ్ళాడే యత్నం మానటానికి ఒప్పుకోలేదు.

ఈసారి పాదరసం ఒక నౌకరువేషం వేసుకుని జురేక్ దుకాణానికి సంచీ పట్టుకెళ్ళి, "వేయించిన చేపలు వేడివేడిగా ఇప్పించండి," అని అడిగాడు.

"వేడిగా కావాలంటే నిప్పు చేసినదాకా ఆగు!" అంటూ జురేక్ అవతలికి వెళ్ళాడు. వెంటనే పాదరసం సంచీ పట్టుకున్నాడు. మళ్ళీ గంటలూ, డప్పులూ మోగాయి. ఒక్క దూకున జురేక్ దుకాణంలో వచ్చి పడి, "నీవేషం నేను కనిపెట్టలేదనుకున్నావురా?" అంటూ సీసంగుండు పాదరసం తలకి గురిపెట్టి బలంకొద్దీ విసిరాడు. పాదరసం సమయానికి వొంగాడు. సీసంగుండు నేరుగా వీధిలోకి వెళ్ళి ఒక నౌకరు తీసుకుపోతున్న పెరుగుముంతకు తగిలింది. పెరుగంతా చింది సేవకుడి వెనకే వస్తున్న ఒకానొక కాదీ ముఖానా, గడ్డంమీదా పడింది.

దగ్గిర ఉన్నవాళ్ళు జురేక్‌తో, "కాదీగారు నీ పాపిష్టి డబ్బుకు వడ్డీ లెక్కకట్టి వడ్డించకపోతే చూడు!" అన్నారు.

(ఇంకా వుంది)



పురాతన మానవ [illegible]జ్ఞా[illegible]ం

మొట్టమొదటగా భూమిపై అవతరించిన మానవులలో నా[illegible]లు గమనించబడ్డాయి: ఫ్లోరిస్బాద్ మనిషి, సోలో మనిషి, రొడీసియా మని[illegible]యాండర్తాల్ మనిషి. పెద్ద మెదడులు గల ఈ ప్రాచీన మానవులు లక్షఏళ్ళు లగాయతు 35 వేల ఏళ్ళక్రితం వరకూ నడిచిన కాలంలో జీవించారు. వీరిలో ఆధునిక మానవ లక్షణాలు కొంచెమైనా లేని మాట నిజమే. వీరి తల పైభాగాలు ఎత్తు లేకుండా, బల్లపరుపుగా ఉండేవి. ఒక్క ఫ్లోరిస్బాద్ మనిషి మెదడులోమాత్రం ముందుభాగాలు అభివృద్ధి అయి, అతనికి మాట్లాడే శక్తి, జ్ఞాపక శక్తి ఉన్నట్టు సూచిస్తున్నాయి. పోతే నియాండర్తాల్ మనిషితాలూకు అస్థిపంజరాలు మూడు ఖండాలలో లభించటంమూలాన, అతను దాదాపు భూమి అంతటా వ్యాపించి జీవించినట్టు స్పష్టమవుతున్నది.

పూర్తిగా పరిణామం చెందిన మనిషి 3 లక్షల ఏళ్ళక్రితం భూమిపై కనిపించాడు. ఇతని తాలూకు శిథిలాలు యూరప్‌లో స్వాన్స్‌కూంబ్‌వద్దా ఆఫ్రికాలో కంజెరావద్దా దొరికాయి. అయితే ఇతను రొడీసియా మనిషినుంచిగాని, నియాండర్తాల్ మనిషినుంచిగాని అవతరించినవాడు కాడు. ఇతని అవతరణ అంతకుపూర్వమే జరిగింది; ఇతను వీరితో సహజీవనం చేసినవాడు. భూమధ్యరేఖకు ఉత్తరంగా ఉండే భూమి చాలావరకు మంచు కప్పిఉన్న హిమయుగంలో ఇతను ఆఫ్రికావాసిగా ఉండిఉండవచ్చు. ఏమంటే, ఈ సమగ్ర మానవుడి తాలూకు సాక్ష్యం చాలావరకు ఆఫ్రికాలోనే లభించింది. ఈ మానవుడు దుస్తులు ధరించాడని గాని నిప్పును ఉపయోగించాడనిగాని అనుకోవటానికి ఆధారాలు కనబడవు.

మానవుడు భూమిపై అవతరించాక అనేక విజాతులుగా విస్తరించినప్పటికీ ఒకేజాతిగా ఉండిపోయాడు. ఇతను భూమిపై ఉండినకాలంలో ఎన్నో జాతుల జీవరాసులు పుట్టి అంతరించాయి. కాని మానవుడు జాతివిభజన పొందలేదు, పొందబోడు.

మానవుడి విషయంలో పరిణామమనేది జీవిత విధానంలో మాత్రమే జరిగింది. సుమారు 650,000 ఏళ్ళక్రితం మానవుడు రాళ్లు చెక్కి తనకు కావలిసిన పనిముట్లు చేయనారంభించి "పాత రాతియుగం" ప్రారంభించాడు. ఈ పాత రాతియుగం మూడు దశలుగా విభజించబడింది. ఇందులో మొదటి దశ 170,000 ఏళ్ళక్రితం ముగిసింది, రెండవది 37,000 ఏళ్ళక్రితం ముగిసింది.

ఈ వందల, వేల ఏళ్ళ సంవత్సరాల కాలంలో మానవుడు అతి ప్రయాసతో, కొంచెం కొంచెమే నాగరికత సంపాదిస్తూ వచ్చాడు.

పరవంచన

విసుగుచెందని విక్రమార్కుడు వెనక్కు తిరిగివెళ్ళి, చెట్టునుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, మౌనంగా శ్మశానంవేపు నడవ సాగాడు. అప్పుడు శవంలో ఉన్న బేతాళుడు, "రాజా, మానవయత్నంలో ఏమో ఉందనుకుని ఇంత శ్రమపడుతున్నావు. ఇది కేవలం భ్రమ. నా మాటలో నీకు నమ్మకం లేకపోతే శీలవతి కథ చెబుతాను విను," అంటూ ఈ కింది కథ చెప్పాడు:

పూర్వం యజ్ఞదత్తుడనే బ్రాహ్మడు బాల్యంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుని, కాశీనగరానికి వెళ్ళి అక్కడ గొప్ప పాండిత్యం సంపాదించి, ఎక్కడైనా బతుకు తెరువు సంపాదించుకుందామని విశాలపురం వచ్చాడు. ఆ నగరాన్ని ఏలే ధర్మపాలుడనే రాజు యజ్ఞదత్తుణ్ణి తన కొలువులో ఉంచుకుని, ఒక బ్రాహ్మణ కన్యను చూసి వివాహం చేయించి అతన్ని ఒక ఇంటి


బేతాళ కథలు

వాణ్ణి చేశాడు. కాలక్రమాన యజ్ఞదత్తుడికి ఒక కుమార్తె కలిగింది. ఆ పిల్లకు శీలవతి అని పేరు పెట్టుకున్నారు.

శీలవతి అందంగా వుండేది. ఆమెను బారసాలనాడు చూసినదగ్గిరనుంచీ రాణీకి ఎక్కడలేని మాతృప్రేమా పుట్టుకొచ్చింది. పగలూ, రాత్రీ ఆ పిల్లను తన పక్కలోనే పెట్టుకునేది, తన చేత్తోనే నీళ్ళుపోసి అలంకరించేది. కొంచెంసేపు పిల్ల పాలకోసం తల్లి వద్దకు వెళ్లితే రాణీప్రాణం కొట్టుకుపోయేది.

పాపం, రాణీగారికి పిల్లలు లేరు. కాని శీలవతిని చేరదీసిన కొద్దికాలానికి ఆమె గర్భవతి అయి, నవమాసాల అనంతరం తానుకూ[illegible] ఒక [illegible]పిల్లను కన్నది. ఆ పిల్లకు [illegible]రుపెట్టారు. ఇంత కాలానికి రా[illegible]నవతి కావటానికి కారణం శీలవతే అని అందరూ నమ్మారు. తనకు కుమార్తె కలిగినాకూడా రాణీకి శీలవతిమీద అనురాగం కొంచెంకూడా తగ్గలేదు. ఆమె ఆ పిల్లనుకూడా తన కుమార్తెలాగే పెంచింది. శీలవతి ఎప్పుడూ అంతఃపురంలోనే ఉండేది. కళావతి ఆమెను "అక్కా" అని పిలిచేది. వాళ్ళిద్దరూ ఒక గురువుదగ్గిరే చదువు సాగించారు.

శీలవతికి ఆయేటికాయేడు గడుస్తున్న కొద్దీ యజ్ఞదత్తుడికి ఆ పిల్లనుగురించి బెంగ





జాస్తి అయింది. ఆమె బ్రాహ్మణపిల్లలాగా పెరగలేదు. అస్తమానం అంతఃపురంలో ఉండి క్షత్రియకన్యలాగే పెరిగింది. రేపు స్వయంవరం జరిపించమంటుందో ఏమో నని ఆ బ్రాహ్మడికి భయం పట్టుకుంది. అందుచేత ఆయన ఎవరితోనూ చెప్పకుండా ఒక సంబంధం చూసి శీలవతికి పెళ్ళి ముహూర్తం నిశ్చయించాడు.

ఈ సంగతి తెలియగానే శీలవతికి మనసు కష్టం కలిగింది. ఆమె ఇంతకు చాలాకాలం పూర్వమే కళావతితో కలిసి ఒక శపథం చేసుకున్నది. అదేమంటే, వాళ్లిద్దరూ ఒకేసారి పెళ్ళాడాలి; ఒకరు చేసుకోబోయే యువకుడు, రెండో వారికి కూడా నచ్చాలి. అయితే యజ్ఞదత్తుడు శీలవతికి పెళ్ళి నిశ్చయం చెయ్యటంతో ఆ పిల్లలు అనుకున్న మాటలన్నీ వృథా అయిపోయాయి. ఈ పెళ్లి తప్పించెయ్యాలని ఆమె నిశ్చయించుకున్నది.

ఒకనాటి సాయంకాలం ఉద్యానవనం నుంచి తిరిగి వచ్చేటప్పుడు శీలవతి కళావతితో, "నేను నదిలో స్నానంచేసి ఇప్పుడే వస్తాను. నువు ఇంటికి పద," అని చెప్పి వెళ్ళిపోయింది. ఆమె నదివద్ద తన దుస్తులు విప్పి ఒక రాతికింద పెట్టి, తాను బ్రహ్మచారి దుస్తులు ధరించి, జడ విప్పి ముడివేసి, ఒంటరిగా బయలుదేరింది.

"అక్క" ఎంతకీ రాకపోవటం చూసి కళావతి కొందరు భటులను నదివద్దకు పంపింది. వారు శీలవతి దుస్తులుమాత్రం తెచ్చి మనిషి కనిపించలేదన్నారు. శీలవతి చనిపోయిందని అందరూ రూఢిచేసుకుని శోకాలుపెట్టారు. "మీరు తన పెళ్ళి నిశ్చయించినప్పటినుంచీ అక్క మనసు చెడిపోయింది. ఆమెకీ పెళ్ళి ఇష్టంలేదు," అని కళావతి యజ్ఞదత్తుడితో చెప్పేసింది. అది వినగానే ఆ బ్రాహ్మడు, తన కుమార్తె బుద్ధిపూర్వకంగా ఆత్మహత్య చేసుకున్నదనీ,


దానికి తానే కారకుడిననీ అనుకున్నాడు. ఆయన మనస్సు విరిగిపోయింది. ఆయన మతి చెడినవాడిలాగా అయిపోయి, భార్యతో సహా దేశంవిడిచి పోయాడు.

ఈలోపల బ్రహ్మచారి వేషంలో శీలవతి చాలా రోజులు కాలినడకను ప్రయాణం చేసి బ్రహ్మస్థలమనే గ్రామం చేరుకున్నది. ఆ ఊరివాళ్ళు కొందరు అమెను, "ఎవరు, బాబూ, నువు? ఒంటరిగా ఎక్కడికి వెళు తున్నావు?" అని అడిగారు.

శీలవతి, "అయ్యా, నేనొక బీద బ్రహ్మ చారిని. నాపేరు కృతవర్మ. నాకెవరూ లేరు. చదువుకుందామని కాశీ వెళుతున్నాను," అన్నది వారితో.

"చదువుకోవాలంటే కాశీదాకా వెళ్ళాలా, నాయనా? ఈ గ్రామంలో సోమభట్టున్నాడు. ఆయన గొప్ప కాశీపండితుడు. ఆయనవద్ద చదువుకోవచ్చు," అని గ్రామస్థులు శీల వతిని సోమభట్టు ఇంటికి తీసుకుపోయారు. సోమభట్టు బ్రహ్మచారి వేషంలో ఉన్న శీల వతిని చూసి ముచ్చటపడి, తన ఇంట ఉంచి చదువు చెప్పటానికి ఒప్పుకున్నాడు.

ఈ సోమభట్టుకు సత్యవతి అని ఒక కుమార్తె ఉన్నది. అసలే ఆ పిల్ల అనా కారిది. దానికి తగ్గట్టే స్ఫోటకం పోసి



ముఖం మరింత వికారంగా అయిపోయి, ఒక కన్నుకూడా పోయింది. అపిల్లకు పెళ్లి యీడు వచ్చింది. సోమభట్టు తన కూతు రిని ఇల్లుదాటి రానివ్వక ఎంతో రహస్యంగా ఉంచుతూ సంబంధాలు వెతకసాగాడు. చిట్టచివరకు విద్యాభాస్కరుడనే బ్రాహ్మణ యువకుడు పెళ్ళాడటానికి ఒప్పుకుని తాంబూలాలుకూడా పుచ్చుకున్నాడు. కాని ముహూర్తానికి ముందే ఎవరో అతనితో, సోమభట్టుగారి కుమార్తె చాలా కురూపి అని చెప్పటంవల్ల, తాను పిల్లను ముందుగా చూడాలనీ, కొద్దిరోజులలో అక్కడికి వస్తున్నా ననీ కబురుచేశాడు.




ఈ కబురు అందగానే సోమభట్టుకు కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఈ చిక్కు నుంచి బయటపడటానికి ఆయన ఒక ఆలోచన చేశాడు. ఆయన శీలవతిని చాటుకు పిలిచి, "చూడు, బాబూ. నాకొక్క ఉపకారం చెయ్యాలి. మీదేశపు బ్రహ్మచార్లు ఆడపిల్లలాగా జుట్టుంచుకోవటం కూడా మేలే అయింది. నువు ఒక్కసారి ఆడవేషం వేసుకుంటావా?" అంటూ తన కుమార్తె పెళ్లి వివరాలన్నీ చెప్పాడు.

చిన్నతనంనుంచీ ధైర్యసాహసాలు నేర్చుకుని, అప్పటికే మారువేషంలో మారు పేరుతో ఉన్న శీలవతి ఆడవేషం వెయ్యటానికి సమ్మతించింది. కొద్దిరోజులకే విద్యాభాస్కరుడు పెళ్ళికూతురిని చూడటానికి వచ్చాడు. శీలవతికి చీరె కట్టి, రవికె తొడిగి, నగలు పెట్టి చక్కగా ముస్తాబుచేసేసరికి అద్భుతమైన అంవగత్తెగా తయారయింది. ఆ పిల్లను చూసి విద్యాభాస్కరుడు పరమానందభరితుడైనాడు.

వెంటనే సోమభట్టు పెళ్ళి ప్రయత్నాలారంభించాడు. ఆయన చాలా ధనికుడు. అందుచేత ఎంతెంత దూరాన ఉన్న బంధువులకూ ఆహ్వానాలు పంపాడు. వారిలో చాలామంది సోమభట్టు కుమార్తెను ఎన్నడూ చూసినవారు కారు. బంధువులందరికీ సోమభట్టు శీలవతినే చూపాడు. వారు ఎంతో సంతోషించారు. ముహూర్తం వేళదాకా ఈ వంచన సాగించి. మెడలో పుస్తె కట్టేసమయానికి తన కుమార్తెను తెర చాటున పెళ్లిపీటలమీద కూచోబెడదామని సోమభట్టు ఉద్దేశం.

పెళ్ళిరోజు పెళ్ళివారు వచ్చి విడిదిలో దిగారు. సోమభట్టు తన అసలు కుమార్తెను పెళ్ళికూతుర్ని చేయించి, ఒక గంపలో కూర్చొబెట్టించి, చీకటికొట్టులో ఉంచాడు. గౌరీవ్రతానికిమాత్రం శీలవతే వెళ్లింది. ఆ సమయంలో పెళ్లివారంతా ఆమెను చూసి





ఎంతో మురిసిపడ్డారు. గౌరీవ్రతం కాగానే సోమభట్టు శీలపతిని ఒక గంపలో కూచో బెట్టి చీకటికొట్టుకు తీసుకుపోసాగాడు. అప్పుడు పెళ్లివారి పురోహితుడు, "అయ్యో, పెళ్లికూతుర్ని ఎక్కడికి తీసుకుపోతున్నారు? పీటలమీదికి తీసుకురండి! ముహూర్తం మించి పోతున్నది!" అన్నాడు.

"అయ్యో, మాలో పిల్ల మేనమామ ముహూర్తంముందు పిల్లను దాచటం ఆచారం!" అన్నాడు సోమభట్టు.

"అటువంటి అచారాలు మాకు లేవు. వేగిరం పెళ్లికూతుర్ని పట్టుకురండి!" అని పురోహితుడు తొందరచేశాడు.

అప్పుడు సోమభట్టు తన బావమరిదికి కన్ను మలుపుతూ, "అమ్మాయిని తీసుకు రారా!" అన్నాడు. ఆ పెద్దమనిషి చీకటి కొట్టులోకి వెళ్ళి, చీకట్లో తడివి గంప చేతికి తగలగానే ఎత్తుకుపోయి పెళ్లిపీటలవద్ద ఉంచాడు. అది శీలపతి ఉన్న గంపే! తీరా మంగళసూత్రం కట్టేసి, వధూవరులు తలంబ్రాలు పోసుకునేదాకా సోమభట్టు ఈ పొరపాటు గ్రహించనేలేదు. ఎందుకంటే పెళ్లికూతురు తల వంచుకుని కూచున్నది.

సోమభట్టుకు తేళ్ళూ జెర్రులూ పాకి నట్టయింది. శీలపతి మగవాడేనని అయన ఉద్దేశం. ఈసంగతి బయటపడక పూర్వమే ఏదో ఉపాయంచేసి పెళ్లికూతుళ్లను మార్చె య్యాలి! ఆయన లోపలికి వెళ్లి తన భార్య చెవిలో ఏదో చెప్పాడు. మరి కాస్సేపటికల్లా ఆవిడ తమ ఇలవేల్పు పూనినట్టుగా కేకలు వేస్తూ, "నన్నే మరిచిపోతారా? నన్ను పూజచెయ్యకుండానే మీపిల్లకు పెళ్ళి చేసే స్తారా? చూడండి, మీ కూతుర్ని ఎట్లా చేసే స్తానో!" అన్నది.

అందరూ కంగారుగా లోపలికి పరిగెత్తి చూసేసరికి పెళ్లికూతురి అవతారంలో వారికి అసలు సత్యవతి కనిపించింది. సోమ భట్టు భార్యకు పూనిక దిగిపోయింది.

విద్యాభాస్కరుడు వంచన తెలుసుకో లేక, "మామగారూ! నా గీత [illegible]థంగా ఉండగా మీరేం చెయ్యగలరు! అందగత్తో, కురూపో, కట్టుకున్న భార్యను విధిగా ఏలుకుంటాను!" అని సోమభట్టును ఓదార్చాడు.

ఈసమయానికే అక్కడికి యజ్ఞదత్తుడు భార్యాసమేతంగా వచ్చాడు. సోమభట్టూ, యజ్ఞదత్తుడూ కాశీలో ఒక గురువుదగ్గిరే చదువుకున్నారు. సోమభట్టు తన బాల్య స్నేహితుడితో జరిగినదంతా చెప్పేశాడు. యజ్ఞదత్తుడు కృతవర్మను చూసి, అది తన కుమార్తె అయిన శీలవతేనని గుర్తుపట్టాడు.

ఈ కథ చెప్పి బేతాళుడు, "రాజా, యజ్ఞదత్తుడు తన కుమార్తెకు వివాహం అయినట్టు భావించాలా? విద్యాభాస్కరుడు తన మిత్రుడి కుమార్తెను పెళ్ళాడినట్లు ఆమోదించి సహాయపడాలా? దీనికి సమాధానం తెలిసికూడా చెప్పకపోయావో నీతల పగిలిపోతుంది," అన్నాడు.

"శీలవతే న్యాయంగా విద్యాభాస్కరుడి భార్య. ఆమెను చూసినాకనే అతను పెళ్లికి ఒప్పుకున్నాడు. ఆమె మెడలోనే తాళి కట్టాడు. కురూపి అయినదికూడా ఆ పిల్లే అనే ఉద్దేశంతో అతను ఆమెను ఇష్టంగా ఏలుకోవటానికి సమ్మతించాడు. శీలవతి కూడా తన గురువు కోరినంతవరకే సహాయం చెయ్యక, మెడలో తాళికూడా కట్టించుకున్నది. అందుచేత ఆమెకూడా వివాహానికి ఇష్టపడినట్టే అయింది. అటువంటి సందర్భంలో యజ్ఞదత్తుడు సోమభట్టుకు తన కుమార్తెగురించి నిజం చెప్పేసి ఆమె పెళ్లి ఖాయంచెయ్యాలి. కృతవర్మ నిజంగా స్త్రీయే అని తెలిసినాక సోమభట్టు జరిగిన పెళ్లికి అభ్యంతరం చెప్పలేడు," అన్నాడు విక్రమార్కుడు.

ఈ విధంగా రాజుకు తిరిగి మౌనభంగం కాగానే బేతాళుడు శవంతోసహా మాయమై మళ్ళీ చెట్టెక్కాడు.



ఫోటోవ్యాఖ్యల పోటీ :: బహుమానం రు. 10 లు

1956 జూలై సంచికలో ప్రకటింపబడే ఫోటోలకు నమూనాలు





★ పై ఫోటోలకు సరిఐన వ్యాఖ్యలు ఒక్క మాటలోగానీ, చిన్న వాక్యంలోగానీ కావాలి. (రెండు వ్యాఖ్యలకూ సంబంధం వుండాలి.)

★ మే 10-వ తేదీలోగా వ్యాఖ్యలు మాకు చేరాలి. తరువాత చేరే వ్యాఖ్యలు ఎంత మాత్రమూ పరిశీలింపబడవు.

★ మాకు చేరిన వ్యాఖ్యలలో అత్యుత్తమంగా వున్న సెట్టుకు (రెండు వ్యాఖ్యలకు కలిపి) రు. 10/-లు బహుమానం.

★ వ్యాఖ్యలు రెండూ పోస్టుకార్డుపైన వ్రాసి, ఈ అడ్రసుకు పంపాలి:—చందమామ ఫోటో వ్యాఖ్యల పోటీ, మద్రాసు—26

మే నెల పోటీ ఫలితాలు

మొదటి ఫోటో : ఇంతమాత్రం సందుంటే...

రెండవ ఫోటో : ఇందులో నే నెందుకుంటా?

పంపినవారు : కె. ఎస్. రామకృష్ణారావు, వి. బి. హెచ్. స్కూల్. కదిరి.

బహుమతిమొత్తం రు. 10/- ఈ నెలాఖరులోగా పంపబడుతుంది.



ఇంద్రజాలము

ప్రొఫెసర్ పి. సి. సర్కార్


బిళ్ళల రంగులు చూడకుండా చెప్పటం ప్రారంభకులు సయితం చెయ్యగల ట్రిక్కు. నీలం, తెలుపు, ఎరుపు రంగులు వేసిన బిళ్లలు అనేకం తెస్తాను. అవి మన కానీ బిళ్లలంత ఉంటాయి. వాటి మధ్య చిల్లులుంటాయి. ఇవి చీనాదేశపు డబ్బులని చెబుతాను. వీటి మధ్య చిల్లుల గుండా దారం దూర్చి హారంగా కట్టి, అవి పోకుండా జాగ్రత్త పెట్టుకోవచ్చు.

నేను చేసే ట్రిక్కులో మూడు రంగుల బిళ్లలే ఉన్నాయి—ఎరుపు, తెలుపు, నీలం. నా కళ్ళకు గట్టిగా గంతగాని, చేతిరుమాలుగాని కట్టి నాచేతికి ఈ బిళ్ళలో ఏదైన ఒకటి ఇవ్వండి. వెంటనే నేను దాని రంగు ఏమిటో చెప్పేస్తాను.

నేను చేతులు వెనక పెట్టి నిలబడతాను. నా అనుచరుడు నా చేతికి బిళ్లను అందిస్తాడు. వెంటనే అది ఏరంగుబిళ్ల అయినదీ చెప్పేస్తాను. అన్ని బిళ్ళలూ ఒకే ప్రమాణం గలవి గనక, ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు. తేడా రంగులో మాత్రమే. అయితే నేను కళ్లుమూసుకుని చూడలేని స్థితిలో, రంగు ఎలా కనిపెట్టగలిగానో వారు గ్రహించలేక పోతారు.

ఇందులోని కిటుకేమిటంటే: పక్క పేజీలో వున్న బొమ్మను జాగ్రత్తగా గమనించండి. బిళ్లలన్నీ ఒకే ప్రమాణం, ఒకే మందం గలవన్న మాట నిజమే; కాని వాటి మధ్య వుండే చిల్లులు ఒకే ప్రమాణంకలవి కావు. నీలం రంగు బిళ్ళలకుండే చిల్లులు అన్నిటికన్న చిన్నవి. తెల్ల బిళ్ళలకు గల చిల్లులు అంతకంటె కొంచెం పెద్దవి. ఎర్రని బిళ్లలకు గల చిల్లులు అన్నిటికంటె పెద్దవి.

ఐంద్రజాలికుడు మొట్టమొదటి నుంచీ కూడా ఒక పెనసలులాంటి కొసగల వస్తువును తన చొక్కా చేతిలో దాచి వుంచుకుంటాడు. దీని సహాయంతో తన చేతికి అందించిన బిళ్ళ



మధ్యగల చిల్లిని కొలుస్తాడు. ఆవిధంగా అతను బిళ్ళల రంగు చెప్పగలుగుతాడు. కొద్ది అభ్యాసం చాలు, ఈ ట్రిక్కులో ప్రవీణులైపోవచ్చు. ఇక్కడ ఇచ్చిన బొమ్మలో చిల్లుల ప్రమాణం అతిశయించి చూపబడింది. సులభ గ్రాహ్యంగా ఉండటానికి ఇలా చూపబడినప్పటికీ, వాస్తవంగా చిల్లులు చాలా చిన్నవిగా వుంటాయి. కొసగల పెనసలులాంటి వస్తువు వాటిని సరిగా కొలవ గలుగుతుంది. దీనికి కావలసిన వల్లా ఇత్తడి బిళ్లలు. ఈ బిళ్లలను ఏ కార్ఖానాలోనైనా చేయించి, వాటికి ఎరుపు, తెలుపు, నీలం రంగులు వేయించవచ్చు.

అట్టచివరి బొమ్మ

ఒకరోజు రాజు - 5

ముసలిది కొడుకును చూసి పైత్యాన పడ్డాడనుకుని, " ఈ మాటలకేంగాని, నాయనా, నిన్న ఏం చిత్రం జరిగిందో తెలుసా? మన పేటలో వుండే దండ నాయకుణ్ణి రాజభటులు పట్టుకుపోయి కొరత వేశార్రా! నాకోసం ఖలీఫాగారు వెయ్యి దీనారాలుకూడా పంపించారు. చూస్తావా?" అన్నది.

ఈ మాటలు వినగానే అబూ పిచ్చి తగ్గటానికి బదులు రెచ్చి పోయింది.



"మరి నేను ఖలీఫాను కానంటా వేమే, ముసలితొత్తా! నేనే దండ నాయకుణ్ణి కొరతవేయించాను. నీకోసం నేనే వెయ్యి దీనారాలు పంపించాను. నేనే ఖలీఫాను!" అన్నాడు అబూ, తల్లిని చావగొట్టుతూ.

తల్లి ఈ దెబ్బలు భరించలేక, "రండి, బాబూ రక్షించండి! నాకొడుక్కు పిచ్చెత్తింది! నన్ను చంపేస్తున్నాడు!" అని కేకలుపెట్టింది. క్షణంలో నలుగురూ మూగారు. అబూను నలుగురు పట్టేసుకుని, చేతిలో కర్ర లాగేశారు.

"నన్ను వదలండి! నేనెవరో తెలుసా? ఖలీఫాని! మీ ప్రాణాలు తోడెయ్యగలను!" అంటూ అబూ గొంతుచించుకు అరవసాగాడు.

అబూకు నిజంగానే పిచ్చిపట్టిందని అందరికీ నమ్మకం కుదిరింది. అప్పటి కప్పుడే అతన్ని బలవంతాన పట్టుకు పోయి వెర్రాసుపత్రిలో పడేశారు. అక్కడి అధికారులు అతన్ని ఉదయమూ, సాయంకాలమూ కొరడాలతో కొడుతూ చికిత్స చేయసాగారు. ఈ విధంగా పదిరోజులపాటు చికిత్స సాగే సరికి అబూకు జ్ఞానోదయమయింది.

"నేను నిజంగా అబూ అల్‌హసన్‌నే అయి ఉండాలి. లేకపోతే నన్ను వీళ్లంతా పిచ్చివాడికింద ఎందుకు జమకడతారు? ఒకవ్రైనా నేను

ఖలీఫానని ఎందుకు గుర్తించరు?" అనుకున్నాడతను.

అతని తల్లి కొడుకుకోసం ఇన్నాళ్లూ బెంగపెట్టుకుని ఉండి, చివరకు ఒకనాడు వెర్రాసుపత్రికి వచ్చింది. అబూ తల్లిని చూడగానే, "అమ్మా! నాకేదో దయ్యంపట్టి అట్లా ప్రవర్తించానమ్మా!" అన్నాడు.

అబూ తల్లి తన కొడుక్కు పిచ్చి నయమయిందని గ్రహించి, వెర్రాసుపత్రి అధికారితో, అతణ్ణి ఇంటికిపంపమన్నది.

అబూ తల్లివెంట ఇంటికి వెళ్లిపోయాడు. వెర్రాసుపత్రిలో తిన్న దెబ్బల గాయాలు మానేదాకా యిల్లు కదలకుండా వుండిపోయి, మళ్ళీ ఆరోగ్యం బాగుకాగానే, యథాప్రకారం సాయంకాలంపూట వూరిబయట వంతెన దగ్గిరికి అతిధులకోసం వెళ్లసాగాడు.

ఒకనాడతనికి మోసుల్ వర్తకుడు వెనకటిలాగే నగరంలోకి వస్తూ కనిపించాడు. కిందటిసారి ఈ మోసుల్ వర్తకుడే తన అగచాట్లకు మొదలు అయాడన్న అనుమానంవల్ల అబూ ఆ వర్తకుడికేసి చూడక ముఖం తప్పించాడు.

అయితే మోసుల్ వర్తకుడివేషంలో వున్న ఖలీఫా తన చారులద్వారా అబూ అల్‌హసన్ వృత్తాంతమంతా విని వున్నాడు. తనమూలంగా కష్టాలు పడిన అబూను ఏదోవిధంగా సత్కరించే వుద్దేశంతోకూడా వున్నాడు. అందుకని ఆయన అబూను సమీపించి, "అబూ అల్‌హసన్‌గారూ, తమరు కులాసాగా వున్నారా?" అని పలకరించాడు.

"మీరెవరో నే నెరగను. మీదారిన మీరు పొండి," అన్నాడు అబూ.

"మన స్నేహాన్ని యింతలో మీరు మరిచిపోవటం బాగాలేదు. మరోసారి మీ ఆతిథ్యం పొందాలని ఎంతో ఆత్రంగా వచ్చాను. నామీద మీకేదో ఆగ్రహం వచ్చినట్టున్నది," అన్నాడు ఖలీఫా.

"కిందటిమారు చేసిన ఉద్ధరింపు చాలదా? దయచేసి మీదారిన మీరు వెళ్లండి!" అన్నాడు అబూ.

(ఇంకా వుంది)





వార్తలు-విశేషాలు

హీరాకుడ్ ప్రాజెక్టువద్ద నెలకొల్పబడనున్న అల్యూమినీం ఫ్యాక్టరీ సాలీనా పదివేల టన్నుల అల్యూమినం ఉత్పత్తి చేయగలదనీ, 1957-వ సంవత్సరంలో ఈ ఫ్యాక్టరీ పని ప్రారంభిస్తుందనీ లోక్‌సభలో మంత్రి శ్రీ నిత్యానంద కనుంగో వెల్లడించారు.

* * * *

సూర్య కిరణాలతో మంచుగడ్డ తయారుచేసే విధానాన్ని ఫిలిప్స్ ట్రోంబే అనే ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు కనిపెట్టాడు. ఒక అద్దం అమర్చబడివున్న 'రెఫ్రిజిరేటర్'ను ఆయన తయారు చేశాడు. ఆ అద్దం తీసుకునే సూర్య కిరణాలనుంచి గంటకు రెండు పౌన్ల మంచుగడ్డ తయారుకాగలదు.

* * * *

మైసూరు రాష్ట్రంలో 30, 40 వేల సంవత్సరాలనాడు ఆదిమానవులు నివసించినట్టు బనసంద్ర కనుమలదగ్గర ఒక స్థలాన్నిబట్టి కనుగొనబడింది. ఆదిమానవులు ఉపయోగించిన రాతి పనిముట్లు, ఆయుధాలు మున్నగువాటిని పురాతత్త్వ శాఖవారు ఈ ప్రాంతంనుంచి సేకరించారు. మైసూరు ప్రభుత్వం ఈ ప్రాంతాన సమగ్ర పరిశీలన జరుపుతున్నది.

* * * *

ద్వితీయ పంచవర్షప్రణాళిక కాలంలో ఆంధ్ర ప్రాంతంలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన 11 స్కీములకు ఆర్థిక సహాయం చేయటానికి సెంట్రల్ సిల్కుబోర్డు సమ్మతించింది. ఇందుకుగాను $10\frac{1}{2}$ లక్షల రూపాయల ఖర్చు అంచనా వేయబడింది. ప్రస్తుతం రాష్ట్రంలో సంవత్సరానికి 800 పౌనుల పట్టు మాత్రం ఉత్పత్తి చేయబడుతున్నది.



రానున్న డిసెంబరులో తుంగభద్ర విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుకు సంబంధించిన రెండు ఉత్పత్తి కేంద్రాలు అమలులోకి రావడంతో, అదనంగా లభ్యమయ్యే విద్యుచ్ఛక్తి సక్రమ వినియోగానికి ఆంధ్ర విద్యుచ్ఛక్తి శాఖ ఇప్పటినుంచే తగుశ్రద్ధ వహిస్తున్నది. 1957 ఏప్రిల్ మొదలుకొని హంపి పవర్ హౌస్‌లో విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కాగలదు.

*　　*　　*　　*

ద్వితీయ పంచవర్షప్రణాళిక కాలంలో విశాఖపట్టణం, మంగళగిరి, కర్నూలు పట్టణాలలో క్షయ ఆసుపత్రులను; జిల్లా ప్రధాన కేంద్రాలలో క్షయ చికిత్సాలయాలను ప్రారంభించడానికి ఆంధ్రప్రభుత్వం పథకాలను రూపొందించింది.

*　　*　　*　　*

గంగానది లోయలో ఖనిజ తైలాలకోసం ఇండియా ప్రభుత్వం అన్వేషణ సాగించుతున్నది. జైసల్మీర్, కాంబే, పంజాబ్‌లలో కూడా యిలాంటి అన్వేషణ ప్రారంభమైంది.

*　　*　　*　　*

ఆంధ్రరాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జపాను పద్ధతిని వరిసాగుకు అనువైన విత్తనాలను గురించి పరిశోధించటానికి ఆంధ్రప్రభుత్వం 10,700 రూపాయలను మంజూరు చేసింది. సామర్లకోటలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అందుకు సంబంధించిన స్కీము త్వరలోనే అమలుపరచబడగలదు.

*　　*　　*　　*


మే నెలలో జరిగే బుద్ధ జయంతి పంచవింశ శతవార్షికోత్సవం సందర్భంగా పాలీభాషలో వున్న బౌద్ధమత గ్రంథాలైన త్రిపిటకాలను, దేవనాగర లిపిలో భారతప్రభుత్వ ప్రచురణ శాఖ ప్రచురిస్తుంది. ఈ సందర్భంలోనే '2,500 సంవత్సరాల బౌద్ధమతం', 'చిత్రాలలో బౌద్ధ మతం', 'అశోకుని శాసనాలు' అన్న పేరుగల పుస్తకాలుకూడా ప్రచురింపబడగలవు.

*　　*　　*　　*

ఆంధ్రకోస్తాలో నెల్లూరుజిల్లాలోని కండలేరువద్ద నౌకావ్యాపారం సాగించడానికి వీలుగా సుమారు రెండు మాసాల కాలంలో మరొక మైనరు రేవుకు ప్రారంభోత్సవం జరుగుతుంది.




చిత్రకథ






దాసూ, వాసూలు బజారుకు షికారు బయలుదేరారు. దారిలో వారికి ఒక మిఠాయి దుకాణం కనిపించింది. దాసు మిఠాయి కొందామన్నాడు. తీరా దుకాణం దగ్గిరకు వెళ్లి చూసుకుంటే, ఇద్దరిదగ్గిరా డబ్బుల్లేవు. అదేసమయంలో డబ్బుల్లేని ఇంకో కుర్రవాడు, దుకాణంవాడు చూడకుండా ఒక మిఠాయి పొట్లాం చేజిక్కించుకున్నాడు. పారిపోతున్న ఆ కుర్రవాణ్ణి 'టైగర్' పట్టుకున్నది. దుకాణంవాడు సంతోషించి, ఆ పొట్లాన్ని 'టైగర్'కు బహూకరించాడు. దాసూ వాసూలు ఆ బహుమతిలో తమవాటా 'టైగర్' దగ్గిర వసూలు చేసుకున్నారు.






Printed by B. NAGI REDDI at the B. N. K. Press (Private) Ltd., and Published by him for Chandamama Publications, from Madras 26—Controlling Editor: SRI 'CHAKRAPANI'


'ఓహో! లైఫ్‌బాయ్ సబ్బుతో
ఇప్పుడు స్నానం చేయుటఅవుసరం'
-అది సంతృప్తి కరమైన
శుభ్రతాభావమును కలిగించును!
LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP
LIFEBUOY
SOAP
భారత దేశంలో తయారుచేయబడినది
L. 259-50 TL


సువాసన కొరకు
సుప్రసిద్ధమైన
దసరా దర్బార్
పుష్పరంజన్
అగరవత్తులు
(REGISTERED)
DASARA
DURBAR
THE MODERN INDIA TRADING Co.
PUSHPARANJAN
AGARBATHY
మాడరన్ ఇండియా ట్రేడింగ్ కంపెని, బెంగళూరు.2.


Photo by B. Bhansali



బహుమతి
పొందిన వ్యాఖ్య

ఇందులో నే నెందుకుంటా ?...

పంపినవారు :
కె. ఎస్. ఆర్. రావు - కదిరి



ఒకరోజు రాజు - 5